# ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



# వార్త

శుక్రవారం 25, అక్టోబర్ 2024 | 16 పేజీలు




2వ పేజీలో...

## నేడు సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ చెల్లింపు

బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల

గత ఏడాది కన్నా ఇది రూ.50 కోట్లు అధికం

ఒక్కో కార్మికుడికి రూ.93,750 బోనస్ చెల్లింపు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటన

# రాజమార్గాన 3లక్షల సీఎంఆర్ ధాన్యం

# ఆంధ్రాకే తరలింపు

ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త: పొలిటికల్ బ్రోకర్లు, అధికార పార్టీల అండ దండలు "రమా" ముడుపులకు తలవంచినా సివిల్ సప్లయి అధికారుల కనుసన్నలోనే 3లక్షల80వేల క్వింటాళ్ల ధాన్యం రాజమార్గాన ఆంధ్రాకు తరలిపోయింది. రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఖమ్మంజిల్లా కొణిజర్ల మండలం లాలాపురం రైస్ మిల్లు యజమాని రూ.81కోట్ల సిఎంఆర్ ధాన్యాన్ని దారిమళ్లించిన విషయం విధితమే. అలాగే ఖమ్మం రూరల్ మండలంలోని మంగలగూడెం, నేలకొండపల్లి మండలంలోని రాయగూడెం గ్రామానికి చెందిన రైస్ మిల్లుల నుంచి మరో 20కోట్ల విలువ చేసే లక్ష క్వింటాళ్ల సిఎంఆర్ ధాన్యాన్ని కూడా అదే మార్గాన రవాణా చేసి కోట్లు దండుకున్నారు. ఇంత జరిగినప్పటి వరకు ధాన్యం కేటాయింపులు పర్యవేక్షణ చేయాల్సిన సివిల్ సప్లయి బాధ్యులైన యంత్రాంగం కనీస చర్యలు కూడా తీసుకోలేదు. దీనిని బట్టి వారికున్న రాజకీయ పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.

రేషన్ షాపు డీలరు పది కిలోల బియ్యాన్ని దారి మళ్లించారనే సంఘటనలో అధికారులు వేటు వేసిన సంఘటనలు కోకోల్లలు జిల్లాలో... కేవలం రెవెన్యూ రికవరి యాక్ట్ కింద, చీటింగ్ కేసులు వంటివి నమోదు చేసి విడి

చిపెట్టడంతో దొంగలు దొరలైపోతున్నారు. కొణిజర్ల మండలంలోని లాలాపురం గ్రామంలో రమాగోపి యజమానిగా ఉన్న ఎస్ఏఆర్ రైస్ మిల్లు నుంచి సిఎంఆర్ 2లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని




వివరాలు 2 లో..

అధికారుల కనుసన్నల్లోనే ధాన్యం లారీలకు రైట్ రైట్

వంద కోట్ల కుంభకోణం

ఒక్కరిపై చర్యలు లేవు

పవర్ బ్రోకర్ల అండతో దర్జాగా సిఎంఆర్ ధాన్యం దొంగలు

## తొలిసారిగా భద్రాద్రి జిల్లాలో..

# గవర్నర్ పర్యటన



భద్రాచలం, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ తొలిసారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నారు. చివరిసారిగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరిగిన శ్రీరామ మహాపట్టాభిషేకానికి పట్టువస్త్రాలు సమర్పించడానికి హెలికాప్టర్ ద్వారా వచ్చి స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి, పట్టాభిషేకాన్ని వీక్షించి హైద్రాబాద్‌కు వెళ్లారు. కాగా నేడు జిల్లాలో రోడ్డు మార్గాన పర్యటించి జిల్లా యంత్రాంగంతో, కళాకారులతో సమావేశమవ్వనున్నారు. ఈ తరుణంలో గురు వారం సాయంత్రం బూర్గంపహాడ్ మండలంలోని సారపాకలో ఐటీసీ గెస్ట్‌హైస్‌కు చేరుకున్న గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్, ఐటిడిఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మర్యాద పూర్వ కంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం చేశారు. శ్రీసీతా రామచంద్రస్వామి వారి దేవస్థానం ఈవో రమా దేవి సన్మానించగా, అర్చకస్వాములు గవర్నర్‌కు వేదాశీర్వచనం అందజేశారు.



గవర్నర్‌కు స్వాగతం పలికిన జిల్లా యంత్రాంగం

2 లో..

నేడు భద్రాద్రి రామయ్యను దర్శించుకోనున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## మీటర్ కావాలంటే..

# లంచం ఇవ్వాల్సిందే



పాల్వంచ క్రైం, ప్రభాతవార్త: "అసలు ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులకు ఏమైంది... సర్కార్ ప్రతీ నెలా జీతం ఇవ్వడం లేదా... ఇచ్చినా ఆ డబ్బులు సరిపోవడం లేదా.. అనవసర ఆడంబరాలకు పోయి అప్పులు చేసుకొని వాటిని తీర్చాలని అధికారులు, ఉద్యోగులు లంచం తీసుకుంటున్నారా.. లేదా జీతం



2వ పేజీలో...

- ఏసీబీకి చిక్కిన లైన్‌ఇన్‌స్పెక్టర్..
- ట్రాన్స్‌కోలో బయటపడిన అవినీతి అధికారి
- రూ.26 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయిన లైన్ ఇన్‌స్పెక్టర్

## రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్న బీజేపి ప్రభుత్వం

నేలకొండపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త: కేంద్ర బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తూ నియంతృత్వ పరిపాలన సాగిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని




2వ పేజీలో...

-హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే సహించేది లేదు

-సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ధ్వజం

# రాజమార్గాన 3లక్షల క్వింటాళ్ల సిఎంఆర్ ధాన్యం ఆంధ్రాకు తరలింపు

(మొదటి పేజీ తరువాయి..)

యధేచ్ఛగా రవాణా చేస్తున్న సంబంధిత శాఖ అధికారులు మాముళ్ల మత్తులో తేలియాడుతూ సలాం కొట్టి లారీలతో "రైట్" చెప్పెసారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 2లక్షల క్వింటాళ్ల సిఎంఆర్ ధాన్యం 710 లారీల ట్రిప్పుల ద్వారా లాలాపురం నుంచి కొణిజర్ల, కొణిజర్ల నుంచి పెద్దగోపతి అటు నుంచి పొద్దుటూరు, ఇక్కడ నుంచి బోనకల్లు మీదుగా గోవిందాపురం నుంచి ఎన్‌టిఆర్ కృష్ణా జిల్లాలోని వత్సవాయి ద్వారా ఆంధ్రాలోకి స్వేచ్ఛగా రవాణా చేశారు. ఆంధ్రా తెలంగాణ మధ్య ఉండే చెక్‌పోస్టులను సైతం తమదైన పద్ధతిలో మేనేజ్ చేసినట్లు సమాచారం. అలాగే మంగలగూడెంలోని రైస్ మిల్లు, రాయగూడెంలోని మరో రైస్ మిల్లు రెండు కలిపి లక్ష క్వింటాళ్ల ధాన్యాన్ని కూడా ఆంధ్రా ప్రాంతానికి విక్రయించి మిల్లర్లు తమ జేబులు నింపుకున్నట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది.

**– సివిల్ సప్లయి అధికారుల తనిఖీలు ఏమయ్యాయి..?**

ప్రధానంగా ధాన్యాన్ని ఆనాడు డిఎస్‌వో, డిఎంగా ఉన్న ఓ అధికారి ఈ మిల్లులకు ధాన్యాన్ని కేటాయించారు.అంతకు ముందే ఈ మూడు మిల్లులకు 50కోట్ల ధాన్యం బకాయి ఉండగా వాటిని రికవరి చేయకుండానే మరో 50కోట్ల విలువైన ధాన్యాన్ని సివిల్ సప్లయి నిబంధనల ప్రకారం చేయరాదు. కాని ధాన్యాన్ని కేటాయించారు. చట్టరీత్యా వాళ్లపై చర్యలు తీసుకోవాలి.అలాగే సివిల్ సప్లయి డిఎస్‌వో, డిఎంలు మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి ఆ మిల్లులో బియ్యం ఎన్ని సివిల్ సప్లయికి పంపారు, ఇంకా ధాన్యం ఎంత ఉందనే విషయంపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి సివిల్‌లో ఉండే రిజిస్టర్‌లో వీళ్లు సంతకాలు చేయాల్సి ఉంది.తనిఖీల సందర్భంగా తేడా వస్తే మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవాలి. అలాగే 4, 5 మండలాలకు కలిపి డిపిసిఎస్ (డిప్యూటీ తహశీల్దార్ సివిల్ సప్లయి) అధికారి ఉంటారు. ఈ అధికారి ఎప్పటికప్పుడు రైస్ మిల్లులు తనిఖీ చేసి రైస్ మిల్లులకు ఎంత ధాన్యం వచ్చింది ఆ వచ్చిన ధాన్యం 15రోజుల్లో మిల్లు ఆడించి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చేయడం ఆయన ప్రధాన విధి.అలాగే ధాన్యం ఏ గోదాములో నిల్వ చేశారు. తడవకుండా మిల్లు యజమానులతో చర్యలు తీసుకున్నారా లేదా అక్రమ రవాణా జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆయనదే. అలాగే రేషన్‌బియ్యం మిల్లులో కొనుగోలు చేసి రిసైక్లింగ్ కాకుండా నిలువరించాల్సిన బాధ్యత కూడా ఆ అధికారిపైనే ఉంది. కానీ ఖమ్మం,రఘునాథపాలెం మండలం, తిరుమలాయపాలెం, కూసుమంచి, కొణిజర్ల, నేలకొండపల్లి ముదిగొండ మండలాలకు కలిపి డిపిసిఎస్ ఉన్నారు. కాని సిఎంఆర్ ధాన్యం దారి మళ్లించిన మూడు మిల్లులు కూడా ఒక అధికారి పరిధిలో ఉండడం విశేషం.

**– పోలీసుల తనిఖీలు, డిసిసిఎస్ తనిఖీలు లేవు –**

రోడ్డుపై వెళ్లే లారీలను ఆపి వాహనాలను తనిఖీలు చేసే పోలీసులు వందలాది లారీల ధాన్యం కొణిజర్ల పోలీస్ స్టేషన్ పక్కనుంచే ఆంధ్రాకు తరలి వెళ్తుంటే కనీసం పట్టించుకోలేదు. అలాగే 8ఏళ్లుగా ఇక్కడే పనిచేస్తున్న సివిల్ సప్లయి తహశీల్దార్ స్థాయి అధికారి ఈ మిల్లుల్లో తనిఖీలకు వెళ్లేవారు కాని అక్రమాలను నిరోధించలేకపోయారు. మాముళ్లకు కక్కుర్తిపడ్డ ఈ అధికారి ఇక్కడ నుంచి బదిలీ అయినప్పటికి తనకున్న రాజకీయ పలుకుబడితో మిల్లుల యజమానులే పైరవీలు చేసి ఇక్కడే తిరిగి పోస్టింగ్ ఇప్పించడం విశేషం. ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఈ అధికారి విజయపరంపరగా అక్రమరవాణా జరుగుతున్నా కనీసం పట్టించుకోలేదు. దొంగలు, దొంగలు ఊళ్లు పంచుకున్న చందంగా ఎవరికి వారు మాముళ్ల మత్తులో తూగుతూ నాడు అధికార టిఆర్ఎస్ పార్టీని నేడు ఉన్న కాంగ్రెస్ నేతలను అడ్డం పెట్టుకొని ఏళ్ల తరబడి ఇక్కడే తిష్టవేసి కోట్ల కుంభకోణానికి లైసెన్సులు ఇచ్చారు. రాష్ట్ర చరిత్రలోనే ఈ పెద్ద కుంభకోణం మరెక్కడా జరగలేదని ఆయా మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘాలు రోడ్లు ఎక్కి ధర్నాలు చేస్తున్నప్పటికి ఆర్ఆర్ యాక్ట్ పెట్టాం, సివిల్ కేసులు పెట్టామంటూ బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోకపోగా ఈ తతంగంపై సివిల్ సప్లయిలోని ఉన్నత స్థాయి అధికారులపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**– అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి – యూనియన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు**

అవకతవకలకు పాల్పడిన మిల్లులకు స్థాయికి మించి ధాన్యాన్ని కేటాయిం చారు. ఇది సరైన పద్ధతి కాదని సివిల్ సప్లయి అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియజేశాం. జిల్లా సివిల్ సప్లయి ప్రతిష్టను మంటగలిపిన ఆయా మిల్లుల యజమానులపై కఠినచర్యలు తీసుకొని వాళ్ల బ్యాంకు అకౌంట్లను సైతం సీజ్ చేయాలి. ఇందుకు బాధ్యులైన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పేదలకు చేరవేస్తున్న బియ్యాన్ని దారి మళ్లించడం అన్యాయం.

# నేడే సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ చెల్లింపు

**కొత్తగూడెం, అక్టోబర్ 24 – ప్రభాతవార్త:**

దీపావళి బోనస్‌గా పిలవబడే పీఎల్ఆర్ఎస్ (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డు స్కీం)బోనస్‌ను శుక్రవారం సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గురువారం సచివాలయంలో ప్రకటించారు. దీనికోసం సింగరేణి సంస్థ రూ.358 కోట్లు విడుదల చేయాలని సీఎండీ బలరాంను ఆదేశించారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కల్లా దీపావళి బోనస్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దీపావళి బోనస్ కింద ఒక్కో కార్మికుడు రూ.93,750 అందుకోనున్నారు. దీపావళి బోనస్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40 వేల మంది కార్మికులకు వర్తిస్తుంది. జేబీసీసీఐ విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిణామం, ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్ చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంటోంది. ఈ ఏడాది కోలిండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి బోనస్ చెల్లింపులు జరిగేలా డిప్యూటీ సీఎం ఆదేశాలు ఇచ్చారు.

**– ఈ నెలలో దీపావళి బోనస్‌తో కలిపి కార్మికులకు దాదాపు రూ.1250 కోట్లు చెల్లింపులు**

కాగా ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లు కంపెనీ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కొక్క కార్మికుడికి సగటున రూ.1.90 లక్షలు అందాయి. అలాగే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.5 వేలు చొప్పున చెల్లించారు. పండుగ అడ్వాన్స్ కింద ఒక్కో కార్మికుడికి రూ.25 వేలు చొప్పున మరో రూ.90 కోట్లు కంపెనీ చెల్లించింది. ఇప్పుడు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.93,750 లభిస్తాయి. మొత్తం మీద ఈ నెల రోజుల వ్యవధిలో దీపావళి బోనస్, లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ కింద రూ.1250 కోట్లను కంపెని చెల్లిం చింది. ఈ విధంగా సగటు సింగరేణి ఉద్యోగులు ఈ నెల రోజుల కాలంలో ఒక్కొక్కరు సుమారు మూడు లక్షల వరకు అందుకున్నారు. బోనస్ చెల్లింపుపై తగు ఏర్పాట్లు చేయాలని సీఎండీ శ్రీదర్ పర్సనల్, ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ బోనస్ డబ్బులను దుబారా చేయవద్దని, ప్రభుత్వ పొదుపు సంస్థల్లో దాచుకుఓవాలని లేదా కుటుంబ అవసరాలకు అనుగుణంగా జాగ్రత్తగా వెచ్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మీటర్ కావాలంటే లంచం ఇవ్వాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి..)

కంటే లంచం డబ్బులే ఎక్కువ వస్తున్నాయని.. కష్టపడకుండా రెండు వైపులా వస్తుండటంతో కాదనకుండా తీసుకుంటున్నారా... మనల్ని ఎవరు పట్టించుకుంటారులే... అందిన కాడికి దోచుకుందాం... మనం బదిలీ అయిన తర్వాత మన సీట్‌లో వచ్చే వారు ఆ ప్రాబ్లం చూసుకుంటారులే అనే ధైర్యమో... అసలు ఏమో కానీ.. ప్రభుత్వ కొలువులు చేసే అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ఎందుకు లంచం తీసుకుంటున్నారో అర్థం కావడం లేదని..." పలువురు చెప్పుకుంటున్నారు. ప్రతీ నెలా కనీసం ఒక్కొక్కరికి తక్కువలో తక్కువ రూ.30 వేలకు పైనే జీతాలు వస్తాయి కదా... ఉన్నతస్థాయి అధికారులంటే కనీసం లక్ష వరకు అయినా జీతం వస్తది.. అయినా ఎందుకు లంచం తీసుకుంటున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఏదైనా పని కోసం ధరఖాస్తు చేసుకున్నా, సదరు అధికారి సంతకం చేయాలన్నా లంచం ఇస్తేనే కాని అక్కడ ఆ పని జరగని పరిస్థితి నెలకొందని చెప్తున్నారు.

**– ఏసీబీకి చిక్కుతున్న అవినీతి అధికారులు...**

జిల్లాలో వరుస సంఘటనలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ఎందుకంటే ప్రభుత్వ శాఖల్లో ఉండే అధికారులు, సిబ్బంది లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కడంతో వారి బాగోతం మొత్తం బయటపడుతోంది. గతంలో వారు చేసిన అవినీతి, అక్రమాలు, తీసుకున్న లంచాలు ఈ చిట్టా మొత్తం బయట పడుతోంది. వెరసీ వారు జైలు పాలవుతున్నారు. మొన్నటి వరకు పోలీస్ శాఖలో ఎస్సై, కిందిస్థాయి సిబ్బంది లంచం తీసుకుంటూ పట్టుబడితే నిన్న ఉద్యాన అధికారి డ్రిప్ కోసం సంతకం చేయాలంటే డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీకి దొరికిపోయారు. తాజాగా పాల్వంచ ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నాగరాజు మీటర్ కోసం రూ.26 వేలు లంచం డిమాండ్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా అధికారులకు పట్టుబడ్డారు. ఈ వరుస సంఘటనలు పరిశీలిస్తున్న ప్రజలు ప్రభుత్వ అధికారులకు ఏమైంది.. డప్పు పిచ్చి పట్టిందా... లంచం అనే భూతం వారిని వెంటాడుతోందా.. ఒక శాఖలో అయితే ఏదో అలా జరిగిపోయిందిలే అనుకోవచ్చు కాని ఒకటి కాదు రెండు కాదు దాదాపు అన్ని శాఖల్లో ఇలాంటి సంఘటనలే చోటు చేసుకోవడంతో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**– డబ్బులిస్తే చాలు.. అన్ని పనులకు గ్రీన్ సిగ్నల్...**

ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న నాగరాజు ఇటీవల నవభారత్ ఏరియాలో పోల్స్ మార్చడం జరిగింది. గతంలో విద్యుత్‌శాఖ సంబంధం లేకుండా రాత్రికి రాత్రే మార్చడం జరిగింది. ఈ అధికారి ఆ ఏరియాలో ఓ వైట్‌కాలర్ పెద్దమనిషి విద్యుత్‌శాఖ అధికారికి ఫిర్యాదు చేస్తే అది వాస్తవమని తెలిసి అక్కడి నుంచి అన్నపురెడ్డిపల్లికి బదిలీ చేశారు. అప్పుడే ఉన్నతాదికారలు సస్పెండ్, మెమోలు ఇలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా కేవలం బదిలీ చేశారు. దీంతో అతని ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. తప్పు చేశారని తెలిస్తే అప్పుడే సస్పెండ్ చేసి ఉంటే ఇలాంటి సంఘటన పునరావృతం అయ్యేది కాదుకదా అంటూ జిల్లా ప్రజలు చెప్పుకుంటున్నారు. సదరు అధికారి పనిచేసిన సమయంలో డబ్బులిస్తే చాలు ఏ పనైనా ఆమోదించేవారు. తన పరిధిలో తనకు అందినకాడికి దోచుకుంటూ లంచం తీసుకుంటూ డబ్బులు ఇచ్చే వారి పనులు త్వరగా చేసేవారని ఆరోపణలు కూడా లేకపోలేదు.

**– విద్యుత్ మీటర్ కోసం – రూ.26 వేలు లంచం...**

పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు గ్రామానికి చెందిన గుగులోత్ నాగరాజు తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి కరెంట్ మీటర్ కావాలని సదరు లైన్ ఇన్‌స్పెక్టర్ జినుగు నాగరాజును సంప్రదించాడు. అయితే తాను మీటర్ ఇవ్వడం కుదరని, మీటర్ కావాలంటే తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొదట రూ.65 వేలు డిమాండ్ చేయగా బేరసాలతో రూ.30 వేలకు వచ్చాడు. ఆ తర్వాత తాను అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో రూ.26 వేలకు ఫైనల్ చేసుకున్నాడు. సదరు లైన్ ఇన్‌స్పెక్టర్ తీరును చూసిన గుగులోత్ నాగరాజు వెంటనే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ సూచనలతో వారు చెప్పిన విధంగా సదరు లైన్ ఇన్‌స్పెక్టర్‌కు డబ్బులు ఇస్తానని ఫోన్ చేసి బాధితుడు డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అయితే ఏసీబీ సిబ్బందిని చూసి లైన్ ఇన్‌స్పెక్టర్ పారిపోతుండగా వారంతా చుట్టుముట్టి పట్టుకున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు డీఎస్పీ రమేష్ వెల్లడించారు.

**– బదిలీపై వచ్చిన 12 రోజులకే...**

ప్రస్తుతం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన సదరు లైన్ ఇన్‌స్పెక్టర్ జినుగు నాగరాజు బదిలీపై అన్నపురెడ్డి మండలం నుంచి పాల్వంచకు వచ్చారు. బదిలీపై వచ్చి 12 రోజులే అవుతోంది. ఇంతలోనే అలవాటుగా లంచాలు తీసుకుంటూ దొరికిపోయాడు. గతంలో కూడా సదరు నాగరాజు పాల్వంచ పట్టణంలోని నవభారత్ ఏరియాలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి బదిలీపై అన్నపురెడ్డిపల్లికి వెళ్లారు. ఆ తర్వాత మళ్లీ అక్కడి నుంచి పాల్వంచకు బదిలీపై వచ్చి లంచం తీసుకుంటూ పట్టుబడటం ఇప్పుడు చర్చనీయాంశమైంది. గతంలో ఇక్కడ పనిచేసినప్పుడు కూడా ప్రజల నుంచి ముక్కుపిండి మరీ లంచాలు వసూలు చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

# తొలిసారిగా భద్రాద్రి జిల్లాలో గవర్నర్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి..)

కాగా శుక్రవారం ఉదయం 8 గంటలకు ఐటీసీ గెస్ట్ నుంచి భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకోనున్నారు. అక్కడి నుంచి జిల్లా జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ ఎంపిక చేసిన రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలైన ప్రముఖ రచయితలు, కళాకారులతో సమావేశం అయ్యి ముచ్చటించనున్నారు. అక్కడి నుంచి 11 గంటలకు ఖమ్మంలోని ఎన్ఎస్‌పీ గెస్ట్‌కు హైస్‌కు చేరుకోనున్నారు. గవర్నర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌లు అనునిత్యం సమీక్షిస్తున్నారు.

# రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్న బిజేపి ప్రభుత్వం

వీరభద్రం తీవ్రంగా ధ్వజమెత్తారు. గురువారం మూటాపురం గ్రామం నందు మండల సిపిఎం పార్టీ 9వ మహసభ జరిగింది. తొలుత గ్రామంలో సిపిఎం శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. మహసభ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, మూటాపురం గ్రామ అమరవీరుల చిత్రపటాల వద్ద ఆయన పూలు జల్లి ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం పార్టీ జండాను ఆపార్టీ సీనియర్ నాయకుడు ఏలూరి రంగారావు ఆవిష్కరించారు. అనంతరం, లెనిన్‌బాబు నగర్‌లో జరిగిన బహిరంగసభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ దేశంలో బిజేపి ప్రభుత్వం కులాలు, మతాల మధ్యన విభేదాలు, ఉద్రేకాలు సృష్టిస్తూ మతోన్మాద విధానాలను అవలంభిస్తూ దేశాన్ని విచ్చిన్నం చేస్తోందని ఆయన విమర్శించారు. హిందూ రాజ్యస్థాపన పేరిట ప్రధానమంత్రి నరేంద్రమోడి దేశ సంపదను అంబాని, అదాని వంటి కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన పట్ల ప్రజలలో తీవ్ర అసంతృప్తి పెల్లుబుకుతోందని ఆయన చెప్పారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్ళు కూలగొడితే సహించేది లేదని ఆయన చెప్పారు. రైతు భరోసా ఊసేలేదన్నారు. భవిష్యత్‌లో ఈ పథకాన్ని ఎత్తేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. కమ్యునిస్టు సిద్ధాంత ప్రకారం మార్క్సిజం, లెనినిజంను అంగీకరించే వాడే నిజమైన కమ్యునిస్టు అని ఆయన చెప్పారు. ఈ మహసభలో సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పొన్నం వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్, జిల్లా నాయకులుగుడవర్తి నాగేశ్వరరావు, బుగ్గవీటి సరళ, షేక్.బషీరుద్దీన్, బండి పద్మ, కోటేశ్వరరావు, కొమ్ము శ్రీను, మండల సిపిఎం కార్యదర్శి కేవి రామిరెడ్డి, రచ్చ నర్సింహరావు, బెల్లం లక్ష్మి, పగిడికత్తుల నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, మందడపు మురళీకృష్ణ, మారుతి కొండలరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, దేగల వెంకటేశ్వర్లు, శీలం అప్పారావు, ఎడ్ల తిరుపతిరావు, ఎరదేశి నర్సింహరావు, దండా సూర్యనారాయణ పాల్గొన్నారు.

# ఐలు రాష్ట్ర మహిళా సదస్సు

**ఖమ్మం లీగల్, అక్టోబర్ 24, ప్రభాతవార్త:**

అఖిల భారత న్యాయవాదులసంఘం(ఐలు) తెలంగాణ రాష్ట్ర మహిళా సదస్సు ఈనెల 26,27 తేదిల్లో ఖమ్మంనగరంలో సప్తపది ఫంక్షన్‌హాల్లో ఉదయం 10.30గంటలకు మహిళా ప్రతినిధుల సభ ప్రారంభం అవుతుందని రిషప్షన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి నల్లమల నవీన్, చైతన్య, మీసాల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం10.30గంటలకు మహిళ ప్రతినిధుల సభ ప్రారంభం అవుతుందని సాయంత్రం 5.30గంటలకు హైకోర్టు న్యాయమూర్తి పి.సుధచే క్యాన్సిట్యూషన్ రోల్ ఆఫ్ ఉమెన్ అనే అంశం క్లాస్ ఉంటుందని అతిధులు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, ఐలు గౌరవ అధ్యక్షులు జి.విద్యాసాగర్, కొల్లి సత్యనారాయణ, సిహెచ్ శైలజ హాజరవుతారు. 27వ తేదిన మహిళా ప్రతినిధుల సభ ఉంటుందని కావున శనివారం సాయంత్రం జరిగే సెమినార్‌కు న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా వారు కోరారు.

## నర్సయ్య కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది



తల్లాడ, అక్టోబర్ 24, ప్రభాతవార్త

మండల పరిధిలోని నరసరావుపేట గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సానుభూతిపరుడు సుంకర నర్సయ్య సంస్మరణ సభ కార్యక్రమానికి సిపిఎం పార్టీ జిల్లా నాయకులు మాచర్ల భారతి, మాదినేని రమేష్, తాతా భాస్కరరావు, బొంతు రాంబాబులు హాజరై నర్సయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సయ్య కుటుంబానికి సిపిఎం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులు నల్లమోతు మోహన్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, శీలం ఫకీరమ్మ, షేక్ మస్తాన్, సత్తెనపల్లి నరేష్, పులి కృష్ణయ్య, పులి వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## లాభాల బాటలో కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటి

కల్లూరు, అక్టోబర్ 24, ప్రభాతవార్త



కల్లూరు, పెనుబల్లి మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటి 2024-25కు గాను 5 కోట్ల 60 లక్షలకు గాను, సెప్టెంబర్ నెలాఖరు నాటికి 3 కోట్ల 20 లక్షల ఆదాయం మార్కెట్ కమిటికి వచ్చిందని, మార్చి 2025 కల్లా టార్గెట్ రీచ్ అవుతామని డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ అలీమ్ మీడియాకు తెలిపారు. 2023-2024 సంవత్సరంకు గాను కల్లూరు మార్కెట్‌కు వచ్చిన లాభం కోటి అరవై ఏడు లక్షలు అని తెలిపారు. కల్లూరు వ్యవసాయ మర్కెట్ కమిటీలో నగదు బుక్‌లు, చలానాలు, బిల్లులు, సిబ్బంది, హాజరు పట్టిక, వారి పని విధానాలను పరిశీలించి తదుపరి ఖరీఫ్ సీజన్ మొదలవడంతో కల్లూరు, పెనుబల్లి మండలాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి, మార్కెట్ కమిటి సిబ్బందితో చర్చించారు. అనంతరం ఐకెపి, సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రైతులకు, ఈ మార్కెట్ కమిటి ద్వారా ధాన్యం నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులను, రైతులకి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షాల వలన, ధాన్యం తడవకుండా ఉంచుటకు పరదాలను, గాలి ధాన్యం కొనుగోలు సెంటర్లకు పంపడం జరుగుతుందని డిఎంఓ, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటి సెక్రటరి పంతులు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జగదీష్ మార్కెట్ కమిటి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మేరమ్మ తల్లి మందిర నిర్మాణంకు ఆర్థిక సహాయం



కల్లూరు, అక్టోబర్ 24, ప్రభాతవార్త

మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో సేవాలాల్ మేరమ్మ తల్లి మందిరం నిర్మాణం కొరకు నాయకులు పసుమర్తి చందర్‌రావు స్వగృహంలో సిహెచ్.అయప్ప కుమారులు స్థలానికి గాను రూ. 2,15,116/-లు తమ వంతు సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. లక్ష్మీపురం గ్రామం తరపున పసుమర్తి చందర్‌రావుకి, సీహెచ్. రమేష్‌కి, సీహెచ్. వెంకట రమణలకు లక్ష్మీపురం గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుగులోతు కృష్ణ, గుగులోత్ ప్రసాద్, బానోత్ ధర్మా, బానోత్ రాంప్రసాద్, ఇస్లావత్ దీప్లా, భూక్యా వీర ప్రసాద్, భూక్య కృష్ణ, గాలం వెంకటేశ్వర్‌రావు, భూక్యా రవీంద్ర, బానోత్ నవీన్, గుగులోతు ప్రసాద్, సునావత్ భద్ర, మాలోత్ హనుమంతు, మందపాటి మాధవరెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

## ఆయన్నే నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడొద్దు - తలో చేయి వేసి పిల్లల భవిష్యత్తుకు భరోసా



క్రైమ్ ఖమ్మం అక్టోబర్ 24, ప్రభాతవార్త :

విధి నిర్వహణలో అకస్మాత్తుగా మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయి చేయి కలిపి చేయూత అందించారు ఆయన్ని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడవద్దని భావించారు. పిల్లల భవిష్యత్తుకు తలో చేయి వేసి ఆదుకున్న సంఘటన ఇది ఖమ్మం పోలీస్ కమీషనర్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ కమీషనర్ సునీల్ దత్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2000 బ్యాచ్ హెడ్ కానిస్టేబుల్ లోకేష్ ఈ నెల 21వ తేదీన విధి నిర్వహణలో గుండెపోటుతో మరణించాడు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులకు ఉమ్మడి ఖమ్మం జిల్లా తోటి బ్యాచ్ పోలీసు సిబ్బంది ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా రెండు లక్షల తక్షణ సాయంగా అందజేశారు. ఈ బ్యాచ్ కానిస్టేబుల్ అందరూ ఆ కుటుంబానికి మిత్రులుగా ఒక్కటై అండగా ఉంటామని బాసటగా నిలిచారు.మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి అకస్మాత్తుగా దూరం అవడం బాధాకరమని భవిష్యత్తులో కూడా కుటుంబానికి న్యాయం చేస్తామని సహచర కానిస్టేబుళ్ళు భరోసా కల్పించారు.

## నాలుగు దశాబ్దాల పోలీస్ ఆత్మీయ కలయిక



క్రైమ్ ఖమ్మం అక్టోబర్ 24, ప్రభాతవార్త :

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంపికైన 1984 బ్యాచ్ కానిస్టేబుళ్ల నగరంలోని ప్రైవేటు హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో కానిస్టేబుల్స్‌గా ఉద్యోగం ప్రారంభించి హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఎస్ఐ, హోదాల్లో పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్న వీరందరినీ తోటి సహచరుల ప్రోద్బలంతో నాలుగు దశాబ్దాల తర్వాత ఆత్మీయ కలయిక ద్వారా కలుసుకొని ఆనందంగా గడిపారు. 105 మంది సివిల్ కానిస్టేబుల్స్ బ్యాచ్‌లో ప్రస్తుతం 41 మంది సర్వీసులో ఉండగా 39 మంది ఉద్యోగ విరమణ పొందగా 25 మంది చనిపోయారు. ఆత్మీయులంతా చాలా కాలం తరువాత కుటుంబాలతో కలసి సేద తీరారు. ఈ కార్యక్రమానికి చనిపోయిన వారి కుటుంబాలను సైతం ఆహ్వానించి వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకుంటూ ఆత్మీయతను చాటుకున్నారు. గత స్మృతులు నెమరువేసుకొని ఆహ్లాదకరంగా గడిపారు. పోలీస్ సర్వీస్ చేసుకున్న తీపి గుర్తుగా మెమెంటోలు తయారు చేసుకొని ఒకరికొకరు బహుకరించుకున్నారు. మోహన్‌రావు, రామచంద్రరావు, రాయప్ప, శ్రీశైలం, రహీమ్, శ్రీనివాసులు, మాదల శ్రీనివాసరావు, పూనాటి సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కుర్చీల వితరణ

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 24 :



మణుగూరు పట్టణంలోని కుంకుడుచెట్ల గూడెం అంగన్‌వాడీ కేంద్రానికి శివసాయి బాలాజీ సూపర్‌మార్కెట్ యజమాని దోసపాటి రంగారావు-స్వర్ణ దంపతులు తమ మనవడు దోసపాటి హేమంత్ పుట్టిన రోజు సందర్భంగా సుమారు రూ.5వేలు విలువగల 15కుర్చీలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం బాధ్యురాలు సుమ, దోసపాటి నరేందర్, మౌనిక, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు

### టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య అరెస్ట్... రిమాండ్‌కు తరలించిన పోలీసులు

చింతకాని అక్టోబర్ 24, ప్రభాతవార్త :

టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య ను అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించామని చింతకాని ఎస్ఐ షేక్ నాగుల్‌మీరా తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇటీవల కాలంలో లచ్చగూడెం గ్రామానికి చెందిన గోనె ప్రసాద్ విద్యుత్ షాక్ గురై మృతి చెందిన సంఘటనలో కొదుమూరు సబ్‌స్టేషన్ ముందు దర్నా చేసిన సందర్భంలో పోలీస్ విధులకు భంగం కలిగించిన నేపథ్యంలో 10 మందిపై కేసు నమోదు చేశామని దానిలో భాగంగానే పెంట్యాల పుల్లయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని వారు తెలిపారు. అరెస్ట్ చేసిన పుల్లయ్యను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కి తరలించడం జరిగిందని వారు అన్నారు.

### టిప్పర్ ఢీకొని యువకుడు మృతి

కూసుమంచి, అక్టోబర్ 24 (ప్రభాతవార్త) :



మట్టిలోడుతో వెళుతున్న టిప్పర్ ఢీ కొని టూవీలర్‌పై ప్రయాణం చేస్తున్న సుతారికూలీ మృతి చెందిన ఘటన కూసుమంచి మండలం మల్లేపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. మృతుని మేనమామ పడిశాల మైసయ్య కథనం ప్రకారం వివరాలు..మండల పరిధిలోని జుజ్జులరావుపేట గ్రామానికి చెందిన ఐతం అనీల్ (31) సుతారిపని కూలీగా జీవనం సాగిస్తున్నాడు. తాను పనిచేసిన కూలీ డబ్బుల కోసం గురువారం ఉదయం ముదిగొండమండలం మాదాపురం వెళ్లి తన టీఎస్ 04 ఎఫ్‌సీ 6525 నంబర్ గల బైక్‌పై తిరిగి వస్తుండగా మల్లేపల్లి గ్రామంలోకి రాగానే ఎదురుగా కూసుమంచి నుంచి రాజేశ్వరపురం వైపు వెళుతున్న టీఎస్ 01 వోఏ 7247 నంబర్‌గల టిప్పర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా టిప్పర్ నడిపి ఐతం అనీల్ టూవీలర్‌ను ఢీకొట్టాడు. టిప్పర్ ఢీకొట్టగానే అనీల్ రోడ్డుపై పడి తలకు వెనకభాగంలో బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే 108 కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు అనీల్‌ను పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మైసయ్య టిప్పర్ డ్రైవర్ నామారపు వెంకటేశ్వర్లుపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీడల పట్ల మక్కువతో జిల్లాకు పేరు తీసుకురావాలి - పోలీస్ కమీషనర్ సునీల్ దత్



క్రైమ్ ఖమ్మం అక్టోబర్ 24, ప్రభాతవార్త :

అక్టోబర్ 20న ఢిల్లీలో జరిగిన వేదాంత హాఫ్ మారథాన్ రన్‌లో పతకం సాధించాన కానిస్టేబుల్ పిల్లి రాజును పోలీస్ కమీషనర్ సునీల్ దత్ అభినందించారు. మొత్తం 36000 మంది పాల్గొన్న హాఫ్ మారథాన్ రన్‌లో కానిస్టేబుల్ పిల్లి రాజు 01:53 నిముషాలలో పూర్తి చేసి మెడల్ సాధించారు. అంతేకాకుండా ఆగస్టు 28న ఎన్ఎండిసీ మారథాన్ హైదరాబాద్ రన్ 42 కిలోమీటర్ల పరుగులో కూడా 04:42 నిమిషాలు పూర్తి చేసి మెడల్ సాధించారు. క్రీడల పట్ల ఉన్న మక్కువతో దేశంలో ఎక్కడ మారథాన్ రన్‌జరిగిన పాల్గొని విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలని పోలీస్ కమీషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

### -మరొక యువకుడికి తీవ్రగాయాలు

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*



దుమ్ముగూడెం మండల పరిధిలోని నారాయణరావుపేట గ్రామానికి చెందిన పాయం జంపన్న (20) అనే యువకుడు గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడిక్కడే మృతిచెందాడు. నారాయణరావుపేట గ్రామానికి చెందిన మృతుడు జంపన్న మరో యువకుడు కొమురం వీర్రాజు లక్ష్మీనగరం గ్రామానికి ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో చిన్న ఆర్లగూడెం గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టింది. దీంతో పాయం జంపన్న అక్కడిక్కడే మృతిచెందగా కొమురం వీర్రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు చిన్నఅరుణాచల క్షేత్రం వితరణ

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*



దుమ్ముగూడెం మండలం ముసలమడుగు గ్రామానికి చెందిన వాగే సత్యం అనే వ్యక్తికి చెందిన పూరిల్లు ఇటీవల ప్రమాదశాత్తు అగ్నిప్రమాదం సంబవించి పూర్తిగా దగ్ధమైంది. సర్వం కోల్పోయిన ఆ కుటుంబాన్ని నర్సాపురం గ్రామంలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్నఅరుణాచల వ్యవస్థాపకుడు శివనాగస్వామి గురువారం పరామర్శించి చిన్న అరుణాచల దేవాలయం తరుపున బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులను బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో అరుణాచల సేవా ఘనంమహేష్, భార్గవాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కనుబుద్ధి దేవా, తెల్లం హరికృష్ణ, వాగే ఖాదర్‌బాబు, కొమురం గజేంద్ర, వాగే పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మించాలని బీఆర్ఎస్ పార్టీ వినతి

*భద్రాచలంక్రైం, ప్రభాతవార్త :*



భద్రాచలం పట్టణం జగదీష్ కాలనీ 19వ వార్డులో ప్రజల అవసరం రిత్యా మసీదు వెనుక భాగంలో ఎన్నో ఏళ్ళుగా సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అట్టి ప్రాంతంలో నూతనంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ మంజూరు చేయాలని ఆ ప్రాంత ప్రజలు చిరకాల కోరిక నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు అకోజు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు గురువారం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన శ్రీనివాసరావు స్వయంగా వచ్చి పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అయినాల రామకృష్ణ, కాలనీ మహిళలు కోటపాప, ఎస్కే తస్లీమా, యన్నం సరోజిని, తదితరులు ఉన్నారు.

## పూనెం సత్యనారాయణ మృతికి సీపీయం ఘననివాళి

*భద్రాచలంక్రైం, ప్రభాతవార్త :*



అల్లూరి సీతారామరాజు జిల్లా వీ.ఆర్.పురం మండల సీపీయం సీనియర్ నాయకులు కామ్రేడ్ పూనెం సత్యనారాయణ మృతికి సీపీయం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపాన్ని తెలియజేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏ.జే.రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మాచారి, ఎం.బీ.నర్సారెడ్డి, కారం పుల్లయ్య, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్‌బాబులు, పూనెం సత్యనారాయణ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి పూనెం సత్యనారాయణ విశేషమైన కృషి చేశారని అన్నారు. పూనెం సత్యనారాయణ మృ సీపీయం పార్టీకు, కుటుంబానికి తీరని లోటని అన్నారు. పూనెం సత్యనారాయణకు విప్లవ జోహార్లు అర్పిస్తూ, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## వసతి గృహాలకు వంట సామాగ్రి సరఫరా చేసే టెండర్‌లు పూర్తి

*భద్రాచలం, ప్రభాతవార్త :*



ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుపబడుతున్న పోస్టుమెట్రిక్ వసతి గృహాలలో చదువుతున్న గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించడానికి అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఖమ్మం ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మి అన్నారు. గురువారం భద్రాచలం ఐటిడిఏ సమావేశ మందిరంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బీ.రాహుల్ ఆదేశానుసారం పోస్టు మెట్రిక్ వసతి గృహాలకు సరఫరా చేసే, వంట చేసే సామాగ్రి టెండర్ ప్రక్రియ ఆయన సమక్షంలో టెండర్ బాక్స్ తెరిచి పీవో అనుమతి మేరకు టెండర్ ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని అన్నారు. 12 పోస్టుమెట్రిక్ వసతి గృహాలకు వంట చేసే సామాగ్రి ప్లేట్లు, గ్లాసులు వంట పాత్రలు, గ్రైండర్, స్టీల్ కుక్కర్, ఇడ్లీ కుక్కర్లను సరఫరా చేయడానికి మహబూబ్‌నగర్, వరంగల్ భద్రాచలం, ఖమ్మం, నల్గొండ నుంచి టెండర్లు దాఖలు చేశారని, టెండర్లు చూపిన రేట్లు కాక అతి తక్కువ ధర కోడ్ చేసిన ఏజెన్సీలకు ఈ సామానులు సరఫరా చేయడానికి కమిటీ సభ్యుల సమక్షంలో ఆమోడించడం జరిగిందని, టెండర్ సమయంలో చూపిన సామాన్లను మాత్రమే పీఎమ్‌హెచ్ హస్టళ్ళకు సరఫరా చేయాలని చూపిన సామాన్లను మాత్రమే పీఎమ్‌హెచ్ హస్టళ్ళను సరఫరా చేయాలని నాసిరకంగా ఉన్న వస్తువులు సరఫరా చేసినట్లు మా దృష్టికి వస్తే ఏజెన్సీలకు రద్దు చేయడమే కాక శాఖ పర్యమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీవో నాగార్జునరావు, డీఎంజీసీసీ సమ్మయ్య, ఏటీడీవో జహీరుద్దీన్, ఏవో నారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాంబాబు, తొమ్మిది మంది ఏజెన్సీల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిభిరం ఏర్పాటు

*చర్ల, ప్రభాతవార్త :*




మండల పరిధిలోని లెనిన్ కాలనీలో గురువారం చర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీధర్ ఆధ్వర్యంలో వైద్యశిభిరం నిర్వహించారు. శిభిరంలో వివిధ వ్యాధి గ్రస్తులను పరీక్షించి వైద్యం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ .. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే ప్రాథమిక వైద్య కేంద్రంకు రావాలని, అక్కడ అన్ని రకాల పరీక్షలు, వైద్యం అందుబాటులో ఉందని, గనుక ఎవరూ ప్రైవేటు హస్పిటల్‌ను ఆశ్రయించవద్దని తెలియజేశారు. దోమలు కుట్టకుండా, దోమతెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ గీత, ఆశ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా జాతీయ నేతలతో నియోజకవర్గ కో.ఆర్డినేటర్ రాము

*బూర్గంపహాడ్, ప్రభాతవార్త :*



హైద్రాబాద్‌లోని హోటల్ గోల్కొండ వేదికగా జరిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా సమావేశానికి విచ్చేసిన జాతీయ నేతలను గురువారం పినపాక నియోజకవర్గ సోషల్ మీడియా కో.ఆర్డినేటర్ దునుకు రాము మర్యాదపూర్వకంగా కలిశారు. సోషల్ మీడియా జాతీయ చైర్మన్ సుప్రియ నెట్, తెలంగాణ రాష్ట్ర టెలి కమ్యూనికేషన్ చైర్మన్ మన్నె సతీష్‌కుమార్, రాష్ట్ర సోషల్ మీడియా కో.ఆర్డినేటర్ పెట్టేం నవీన్‌లతో మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా తీసుకెళ్ళేందుకు మండలాల వారీగా కో.ఆర్డినేట్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రతిపక్ష పార్టీల నుంచి వచ్చే విమర్శలను తిప్పి కొట్టే క్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా మండల కో.ఆర్డినేటర్లతో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేసేందుకు సాయ శక్తులు కృషి చేస్తున్నానని తెలిపారు. కాగా రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా సమావేశంలో జరిగిన పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. నియోజకవర్గ సోషల్ మీడియా కో.ఆర్డినేటర్లకు మండల కో.ఆర్డినేటర్లకు రూ.5లక్షల ఇన్సూరెన్స్‌తో పాటు స్మార్ట్ కార్డ్, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడించారని ఆయన పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో పాటు నియోజకవర్గాల శాసనసభ్యులకు కో.ఆర్డినేటర్ సమన్వయం చేసుకునేలా తక్షణ ఆదేశాలను జారీ చేస్తున్నట్లు సమావేశంలో పేర్కొన్నారని ఆయన తెలియజేశారు.



## బాధితులను పరామర్శించిన పొదెం

*అశ్వాపురం,అక్టోబర్24,ప్రభాతవార్త.*

మొండికుంటలో ఇటీవల ప్రమాదాలకు గురైన,మృతిచెందిన కుటుంబాలను గురువారం అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య పరామర్శించారు.ఇటీవల మృతిచెందిన పులసాని రాంరెడ్డి కుమారుడు మహేష్‌రెడ్డి కుటుంబసభ్యులను,గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న కాంగ్రెస్ పార్టీ మొండికుంట గ్రామశాఖ అధ్యక్షుడు కొండాబత్తుల ఉపేందర్‌ను పరామర్శించి,వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మొండికుంట మాజీ ఎంపీటీసీ కమటం నరేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు చెంచల రాము,మచానచ నర్సింహారావు,పద్దం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి మున్నూరుకాపు సంఘం ఆర్థికసాయం

*అశ్వాపురం,అక్టోబర్24,ప్రభాతవార్త.*

మొండికుంటలో ఇటీవల మృతిచెందిన జంగిలి సోమయ్య దశదిన కర్మలకు మండల మున్నూరుకాపు సంఘం నాయకులు 11వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షులు కమటం వెంకటేశ్వరరావు, నాయకులు కాసరబాద రాములు,పర్వత చందర్‌రావు,కమటం నరేష్,చెంచల రాము,పంపన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యత ఇస్తున్నాం

**- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడతాం**
**- తాగునీరు ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలి**
**- రూ.33 లక్షల వ్యయంతో వాటర్‌ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన**





*చుంచుపల్లి, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*
గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యత ఇస్తూ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి జరుగుతోందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం నందాతండా పంచాయతీ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో రూ.33 లక్షల ఏడీపీ నిధులతో నందాతండా, బృందావనం గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించనున్న వాటర్ ట్యాంకు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. తాగునీరు సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాలను, బస్తీలను గుర్తించామని, త్వరలో పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలతో పాటు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు ఉన్న మేజర్, మినీ నీటి పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని, వినియోగంలో లేని పథకాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగరేణి కార్మిక వాడల్లో యాజమాన్యం నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ్యంకు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఎంపీడీవో అశోక్ కుమార్, తహసీల్దార్ కృష్ణ, అధికారులు తిరుమల్, భూమిక, నాయకులు వాసిరెడ్డి మురళి, రాంబాబు, పౌల్, గుండు శ్రీను, మహేష్, మాలోత్ మురళి, మంగీలాల్, శ్రీరామ్, రామోజీ, తులసీరాం, మోహన్‌రెడ్డి, మోహన్‌రావు, తంబళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సింగరేణి ఎక్స్‌టర్నల్ రిక్రూట్‌మెంట్ ఉద్యోగాల భర్తీలో ఉల్లంఘనలు

**- మహిళలకు ఉద్దేశించిన 33 శాతం రిజర్వేషన్ అమలులో ఉల్లంఘనలు**



*కొత్తగూడెం, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*
సింగరేణి ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల భర్తీలో ప్రతీ కేటగిరిలో 3 లేదా అంతకంటే ఎక్కువ నోటిఫైడ్ పోస్టుల ఉన్నప్పుడు మాత్రమే మహిళా అభ్యర్థులకు ఒక పోస్టు కేటాయించబడుతుందని సింగరేణి రిక్రూట్‌మెంట్ విభాగం వితండ వాదం చేస్తుంది. ఈ నిర్ణయం ప్రకారం ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ మహిళా అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుంది. ఎస్టేట్స్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, వెల్ఫేర్ ఆఫీసర్, ఫారెస్టు ఆఫీసర్, ఐఈడీ ఆఫీసర్ తదితర పోస్టుల్లో ప్రతీ కేటగిరిలో మూడు పోస్టుల ఖాళీలు ఏర్పడటం చాలా అరుదు. అంటే ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో 3 లేదా అంతకంటే ఎక్కువ ఖాళీలు ఏర్పడినప్పుడు మాత్రమే మహిళా రిజర్వేషన్ కల్పిస్తారు. అలాంటి పరిస్థితిలో ఆయా కేటగిరి రిజర్వేషన్ అమలుకు నోచుకోలేదు. ఈ పద్ధతి ద్వారా మహిళల రిజర్వేషన్ చట్టబద్ధమైన నిబంధనల ఉల్లంఘన జరుగుతుంది. గౌరవ సుప్రీంకోర్టు రాజేష్‌కుమార్ దరియా వర్సెస్ స్టేట్ ఆఫన రాజస్తాన్ (అప్పీల్ సివిల్ 3132 ఆఫ్ 2007) కేసులో ఇచ్చిన తీర్పులో హరిజాంటల్ రోస్టర్ రిజిస్టర్ పద్ధతిని సూచిస్తూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ మార్గదర్శకాలను నిర్దేశించారు. ఆ తీర్పును అనుసరిస్తూ గౌరవ తెలంగాణ హైకోర్టు కూడా 33 శాతం మహిళా రిజర్వేషన్‌లకు సంబంధిత ఫిబ్రవరి 2024లో స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశించాయి. ఈ తీర్పు ప్రకారం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి. అదే సమయంలో మెరిట్ సెలెక్ట్ అయిన మహిళలతో కలిపి 33 శాతం రిజర్వేషన్‌లకు పరిమితం చేయాలి. తద్వారా పురుషులకు కూడా న్యాయం జరుగుతుంది. ఇటీవల గౌరవ తెలంగాణ హైకోర్టు ద్వారా జూనియర్ సివిల్ జడ్జి పోస్టుల కోసం నోటిఫికేషన్ నంబర్. 87/2024 ఆర్‌సీ తేదీ 10.04.2024నాడు జారీ చేయబడింది. ఆ నోటిఫికేషన్‌లో ప్రతీ కేటగిరికీ మహిళా రిజర్వేషన్ పోస్టులు స్పష్టం పేర్కొనబడ్డాయి. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక చర్యలు తీసుకుంటున్న ఈ తరుణంలో సింగరేణిలో 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు విషయం ఉల్లంఘనలు జరపడం శోచనీయమని బీఎంఎస్ కార్యదర్శి మాధవ్‌నాయక్ తెలిపారు. సింగరేణి సంస్థలో ప్రతీ కేటగిరిలో మూడు పోస్టుల ఖాళీలు ఏర్పడినప్పుడు మాత్రమే ఒక పోస్టు మహిళా అభ్యర్థులకు కేటాయించిన భర్తీ చేయబడుతుందని నిర్ణయించడం మూలానా మహిళలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. యాజమాన్యం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించి మహిళా రిజర్వేషన్ అమలులో గౌరవ తెలంగాణ హైకోర్టు నోటిఫికేషన్ ఆధారంగా మహిళా అబ్యర్థులకు రాజ్యాంగ బద్ధంగా 33 శాతం రిజర్వేషన్ అమలు చేసి తగిన ఆన్యయం చేయాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెంచాల్సిన బాధ్యత టీచర్లదే

**- ఉపాధ్యాయుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్**





*కొత్తగూడెం ఎడ్యుకేషన్, - ప్రభాతవార్త:*
విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచడానికి ఉపాధ్యాయులు వందశాతం కృషి చేయాలని, దానికై హెచ్‌ఎంలు, మండల విద్యాధికారులు తగు ప్రణాళికలు రచించుకొని వాటిని సమర్థవంతంగా అమలుపర్చాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పాఠశాల మౌలిక వసతులపై పూర్తి దృష్టి పెట్టామని, దీని కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు నిధులు విడుదల చేశామని, వీటిని పాఠశాల పరిశుభ్రత కోసం అలాగే దానికి సంబంధించిన సామాన్లు, కొనుగోలుకు మాత్రమే వినియోగించాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఈ పనులను పాఠశాలలో నిర్వహించాలని తెలిపారు. పదవ తరగతి పరీక్షల గురించి చివరి రెండు నెలల్లో ప్రణాళికలు రచించడం కాకుండా మొదటి నుంచే ప్రణాళికా బద్ధంగా పిల్లలను చదివించి పరీక్షలకు సమాయత్తం చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. పాఠశాలల్లో ఔషద మొక్కలు, అవసరమైనటువంటి ఇతర మొక్కలను ఏర్పాటు చేయడానికి హెచ్‌ఎంలు చేసిన కృషిని అభినందించారు. త్వరలో పాఠశాల వ్యవసాయం అనే కార్యక్రమాన్ని కూడా తీసుకుంటామని, దానికి ఉపాధ్యాయులు అందరూ సహకరించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు ఇంటి వద్ద రాత పనిని ప్రోత్సహించిన వారికి నోట్ పుస్తకాలను అందిస్తున్నామని, ఈ నోటు పుస్తకాలు ఏ విధంగా ఉపయోగించాలనే అంశం మీద జిల్లా రీసోర్స్ గ్రూప్ పనిచేసిందని, వాటిని సమర్థవంతంగా వినియోగింపచేయడం కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల విద్యాధికారుల బాధ్యత అని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీఈవో వెంకటేశ్వర చారి, పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, జిల్లా అడకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు, జిల్లాలోని అన్ని మండలాల ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.




**చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్**

## కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో సత్తా చాటిన దేవీప్రసన్న

*కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*



మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో దేశంలోనే అన్ని రాష్ట్రాల్లో కంటే తెలంగాణ రాష్ట్రం ప్రథమంగా నిలిచింది. ఆ ఘనత రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలైన సునీతారావుదే అని ఆతర్వాత 8 మంది మహిళా కాంగ్రెస్ నేతలు ఆధిక్యతతో నిలిచారు. వీరిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి మెజార్టీ సాధించిన మహిళా నాయకురాలను ఢిల్లీకి ఆహ్వానించి మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్కలంబ అభినందించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఢిల్లీ కార్యక్రమానికి వెళ్లలేని జిల్లా అధ్యక్షురాలిని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు అభినందనలు తెలిపారు.

## ఒకేషనల్ విద్యార్థులకు మెయింటినెన్స్ చార్జి వేసి భారాన్ని పెంచకండి



*కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*
ఒకేషనల్ ఓజేటీ కోసం మెయింటినెన్స్ చార్జి అని తీసుకొని విద్యార్థులకు భారాన్ని పెంచవద్దని కొత్తగూడెం జీజీహెచ్ అడిషనల్ సూపరింటెండెంట్‌కు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఫహీం దాదా మాట్లాడుతూ... ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఓజేటీ కోసం ఒకేషనల్ విద్యార్థుల దగ్గర మెయింటినెన్స్ ఛార్జిలు అడగటం సరైంది కాదని, ఒకేషనల్ విద్యనభ్యసించే వారిలో బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ, ఈసీ, మైనార్టీ విద్యార్థులు ఎక్కువ ఉన్నారని, 45 రోజుల ఓజేటీ కోసం మెయింటినెన్స్ చార్జి ద్వారా విద్యార్థులకు అధిక భారం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖయ్యూం, వినయ్, కిషోర్, శివ, రణధీర్‌లు పాల్గొన్నారు.

## కల్లోజి జయమ్మ ధన్యజీవి: కూనంనేని

*లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*



తన పిల్లలను సమాజం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దిన కల్లోజి జయమ్మ ధన్యజీవి అని కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీనియర్ విలేఖరి, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ తల్లి జయమ్మ సంస్మరణ సభ గురువారం హేమచంద్రాపురంలోని ఆయన స్వగృహంలో జరిగింది. ఈ సభకు హాజరైన ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, కాంగ్రెస్ నాయకుడు నాగ సీతారాములు, చంద్రగిరి శ్రీనివాసరావు, నేరెళ్ల రమేష్, మద్దెల శివకుమార్‌లు ఉన్నారు.

## ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు పూర్తి జీతం చెల్లించాలి



*కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*

మినీ అంగన్‌వాడీ టీచర్ల నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్ల నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రమోషన్ పొందని వారికి 13,650 పూర్తి జీతాన్ని చెల్లించాలని ఖాళీగా ఉన్న టీచర్ హెల్పర్ పోస్టులను భర్తీ చేయడానికి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జాతీయ కోశాదికారి సాయిబాబు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సీఐటీయూ జిల్లా జనరల్‌బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఐసీడీఎస్‌ను ప్రైవేట్ పరం చేయడానికి చూస్తోందని అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తుందని విమర్శించారు.

## జిల్లా లీగల్‌సెల్ అథారిటీ కార్యదర్శి జిల్లా జైలు సందర్శన



*కొత్తగూడెం లీగల్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జడ్జి గొల్లపూడి భానుమతి తొలిసారిగా ఖమ్మం జిల్లా జైలును గురువారం సందర్శించారు. ఖైదీల స్థితిగతులను అడిగి తెలుసుకొని వారి సందేహాలను నివృత్తి చేశారు. తగిన సలహాలు, సూచనలు చేసి వారిని చైతన్యం కల్పించారు. ఎవరైనా అర్హులైన విచారణ ఖైదీలు బెయిల్ మంజూరు అయినప్పటికీ తగు జమానతులను న్యాయస్థానంలో ప్రవేశపెడితే అట్టి వారికి అండర్ ట్రైల్ ప్రిజనర్స రివ్యూ కమిటీ ద్వారా తగు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అదే విధంగా విచారణ ఖైదీలు తమ తమ కేసుల్లో న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేని వారికి న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌రావు, జైలు సూపరింటెండెంట్ శ్రీధర్, జైలర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## కన్వెన్షన్ డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి

*కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*



సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కన్వెన్షన్ డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంగం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ప్రతినిధి బృందం జీఎం ట్రాన్స్‌పోర్టు బి. సీతారామయ్యను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. సింగరేణిలో సుమారు 2 వేల మంది కన్వెన్షన్స్ డ్రైవర్లు పనిచేస్తున్నారని, వారికి గతం నుంచి కనీస వేతనాలను అమలు చేయడం లేదని, ఇప్పుడు సీఎంపీఎఫ్ కటింగ్ పేరుతో ఓనర్ వాటా కూడా డ్రైవర్ జీతంలో చూపిస్తూ అసలే తక్కువగా ఉన్న వేతనాలను మరింతగా తగ్గిస్తున్నారని అన్నారు. సింగరేణి యాజమాన్యం టెండర్‌లో డ్రైవర్లకు చెల్లిస్తున్న వేతనాలు డ్రైవర్లకు చేరడం లేదని, యాజమాన్యం దీనిపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూరం ఐలయ్య, భూక్యా రమేష్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీలో రాజకీయ జోక్యం తగదు



*పాల్వంచ టౌన్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాల్వంచలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 3 లక్షల మంది జనాభా ఉన్న నియోజకవర్గానికి మూడు వేల ఇండ్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ఇంటి స్థలం, ఇండ్లు లేక పేదలు, అనేక ఇబ్బందులు గురవుతునానరని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అదే విధంగా ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు రాజకీయాలకు అతీతంగా వేయాలని, అలా కాకుండా కమిటీల ఎంపికకు సంబంధించి ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు సూచించిన తన అనుయాయుల పేర్లను సిఫార్సు చేస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున్‌రావు, కాకటి హుస్సేన్, గుగులోత్ సరోజ, పీక మల్లికార్జున్‌లు పాల్గొన్నారు.

## సీసీరోడ్డు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కూనంనేని

*పాల్వంచ టౌన్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*



మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు గ్రామంలో సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాలు పాల్గొన్నారు. జీఎస్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు ఆరెం ప్రశాంత్ తమ సమస్యలను వివన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఇళ్ల పట్టాలు మంజూరు, మిషన్ భగీరథ సదుపాయం, ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, గతంలో వేసిన ప్రధాన సీసీ రోడ్లు, పూర్తిగా డ్యామేజ్ అయిన కారణంగా మరలా సీసీ రోడ్లు మంజూరు చేయాలని కోరారు. శ్రీనివాస్ కాలనీ నుంచి గుడిపాడు గ్రామం వరకు వీధి లైట్లు ఏరాప్రటు చేయాలని, మొర్రేడు వంతెన నిర్మాణం డ్యామేజ్ అనే సందర్భంగా మరమ్మతులు చేపూఇంచాలని, ఇంటి పనులు మంజూరు చేయాలని, మున్సిపాలిటీ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారం చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగ సీతారాములు, మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## నేడు దీపావళి బోనస్ చెల్లింపు



*రుద్రంపూర్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*

సింగరేణి సంస్థ కార్మికులకు దీపావళి బోనస్ పీఎల్ఆర్ఎస్ బోనస్‌ను శుక్రవారం కార్మికుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతనాల బోర్డు చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌లో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య, జనరల్ సెక్రటరీ త్యాగరాజు, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, కార్పోరేట్ ఉపాధ్యక్షుడు పీతాంబరరావు, మణుగూరు ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, ఆర్‌జీ త్రీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, భూపాలపల్లి బ్రాంచి కార్యదర్శి మధుకర్‌రెడ్డి, ఇల్లెందు బ్రాంచి కార్యదర్శి నాగేశ్వరరావులు వారిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దీనికోసం సింగరేణి సంస్థ రూ.358 కోట్లు విడుదల చేయాలని, సింగరేణి బోనస్ చెల్లింపుపై తగు ఏర్పాటు చేయాలని సీఎండీ బలరాంను పర్సనల్, ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు.




### పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మిదేవిపల్లి, చంద్రుగొండ

## ప్రభుత్వ కళాశాలలో ఖాళీ పోస్టుకు ఆహ్వానం

*ములకలపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:*

ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎలక్ట్రికల్ టెక్నీషియన్(ఇటి)పోస్టు భర్తీకి అతిథి అధ్యాపక విధానం ద్వారా ఆహ్వానం పలుకుతున్నట్లు ఇంటర్‌మీడియట్ జిలా విద్యాశాఖ అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ములకలపల్లి కళాశాలలో ఈ విద్యా సంవత్సరం చివరి దినం వరకూ ఈ పోస్టు భర్తీకి ఆహ్వానించనైనదని ఇందుకు గాను బ్యాచలర్ ఆఫ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ దానికి తత్సమానమైన డిగ్రీలో 50శాతం మార్కులు లేదా అంతకన్నా ఎక్కువ మార్కులు ఉన్న ఆసక్తి గలవారు ఈనెల 30వ తేదీలోపు జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖ కార్యాలయంలో రూమ్‌నెంబర్ 13లో దరఖాస్తు స్వయంగా సమర్పించాలని వివరాలకు 7997994366కు సంప్రదించాలని కోరారు.

## అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి

*ములకలపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:*



అక్రమ ఇసుక తోలకాలను నిరోధించాలని కోరుతూ మండలంలోని ములకలపల్లి పీసా కమిటి సభ్యులు, ప్రజలు స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు మాట్లాడుతూ మా గ్రామంలో కొంతమంది ట్రాక్టర్ యజమానులు గ్రామ సమీపంలో గల ఇసుకను రాత్రి సమయంలో అక్రమంగా ఏకలవ్య స్కూల్ నిర్మాణానికి తోలుతున్నారని అన్నారు. గత కొంత కాలం నుండి ఈ అక్రమ రవాణా జరుగుతుందని ఇట్టి విషయంపై అనేక పత్రికల్లో కథనాలు వచ్చినా చర్యలు లేవన్నారు. దీంతో ఈ అక్రమ ఇసుక రవాణా యధేశ్చగా సాగుతుందని ఇట్టి అక్రమ రవాణా కొంతమంది ట్రాక్టర్ యజమానులు మాత్రమే చేస్తున్నారని తక్షణమే వీటిని ఆపి ఇందుకు కారకులైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని ట్రాక్టర్‌లను సీజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూకమమిడి పంచాయతీ పీసా కమిటి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

*ములకలపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:*

రాష్ట్రంలో హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిలా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని



కోరారు. మండలంలోని నర్సాపురంలోని కోటమ్మగుడి వద్ద గురువారం జరిగిన హమాలీ కార్మిక సంఘ మండల 6వ మహాసభ నకిరికంటి పుల్లారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో నరాటి మాట్లాడుతూ హమాలీలు రెక్కల కష్టంతో కుటుంబాలను పోసిస్తున్నారని కాని వారికి ప్రభుత్వం నుండి రూపాయికూడా ఆర్థిక సహాయం అందడం లేదన్నారు. మూటలు మోసే క్రమంలో 50ఏళ్ళ వయసులోనే అనారోగ్యం పాలౌతున్నారని కావున వీరిని గుర్తించి భవన నిర్మాణ కార్మిక చట్టం మాదిరిగా హమాలీ కార్మిక సంక్షేమ చట్టం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి యూసుఫ్, వేల్పుల మల్లిఖార్జునరావు, ఎస్‌కె జబ్బార్, నరాటి రమేష్, అనుముల సాయి, మిర్యాల వెంకన్న, నిమ్మల వెంకటేశ్వర్లు, గద్దల రమేష్, కేశవవులు, వీరయ్య, రాంబాబు, గంగ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదిలా బీఆర్ఎస్ నేతను పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుతారా...

మధిరరూరల్, ప్రభాతవార్త: పోలీసులు చింతకాని మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను ఒక ఉగ్రవాదిలాగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పటం బాధాకరమని మాజీ జడ్పీచైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మధిరలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మంజిల్లా చింతకాని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యపై కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసు అధికారులను వారి చెప్పుచేతుల్లో ఉంటూ అక్రమ అరెస్టు చేయడం సరికాదన్నారు. చింతకాని మండలం లచ్చగూడెంలో ఓ రైతు కుటుంబానికి జరిగినటువంటి నష్టాన్ని ఈ పోలీసు అధికారులు తీరుస్తారా అని ప్రశ్నించారు. రైతు కుటుంబంగా పార్టీ నాయకుడిగా బాధిత కుటుంబం వైపు భరోసాగా నిలబడినందుకు కక్ష సాధింపుగా పోలీసు అధికారులు అక్రమ అరెస్టుకు కారణమైందన్నారు. వాస్తవంగా పెంట్యాల పుల్లయ్య నేరం చేసి ఉంటే నోటీసులిచ్చి అరెస్టు చేయాలే తప్ప ఇలా దౌర్జన్యంగా ఇంట్లోకి



చొరబడి పోలీసులు జీపులో ఎక్కించుకొని పోవడం బాధాకరమన్నారు. పెంట్యాల పుల్లయ్య ప్రస్తుతం అయ్యప్ప మాలదీక్షలో ఉన్నారని, ఆయన వయస్సు 70సంవత్సరాలు ఉన్నప్పటికీ పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమన్నారు. పోలీసులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరిస్తూ బాధ్యతారాహితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో పదేళ్ల పరిపాలన చేసిన కాలంలో ఇలాగే ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారా అని ప్రశ్నించారు. న్యాయం కోసం పోరాడే నాయకులపై ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదుచేసి అక్రమ అరెస్టులు చేస్తే అధికారులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికారులు వాస్తవాలను పరిశీలించి తప్పుచేసిన వారికి శిక్ష పడేలా పోలీసులు వ్యవహరించాలే తప్ప అక్రమ కేసులు బనాయించే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు తొత్తులుగా మారొద్దని సూచించారు. ఈ సమావేశంలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, చావా వేణు, బొగ్గుల వీరారెడ్డి, కురేష్, నాగబాబు, అబ్బూరి రామన్, శీలం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.




మధిర, బోనకల్, చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఎర్రుపాలెం, అక్టోబర్ 24, ప్రభాతవార్త: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి బాధితులకు గురువారం పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11మంది బాధితులకు రూ.3.50లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శీలం ప్రతాప్‌రెడ్డి, బండారు నర్సింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకట కృష్ణారావు, బండారు రామారావు, మల్లెల లక్ష్మణ్‌రావు, షేక్.జానీబాషా, కడియం శ్రీనివాసరావు, షేక్.ఇస్మాయిల్, కంచర్ల వెంకటనర్సయ్య, గుడేటి బాబూరావు, నందిగం సందీప్, యరమల పూర్ణచంద్రారెడ్డి, దేవరకొండ వెంకటరత్నం, నాగిరెడ్డి శ్రీను, శేషిరెడ్డి, బుర్రా నారాయణ, దేవరకొండ ఏడుకొండలు, నంద్రు బాబూరావు, పుల్లారావు పాల్గొన్నారు.

# మధిర రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన లింగాల కమల్‌రాజు

మధిర అక్టోబర్ 24, ప్రభాతవార్త : చింతకాని మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను నాటకీయ పరిణామాల మధ్య ఆయన స్వగ్రామం ప్రొద్దుటూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రాథమిక విచారణ నిమిత్తం వైరా సర్కిల్ కార్యాలయంకు ఆ తర్వాత వైద్య పరీక్షల నిమిత్తం మధిర ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడి నుండి ఆయనను కోర్టులో హాజరు పరిచే క్రమంలో మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విషయాన్ని తెలుసుకున్న టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు స్టేషన్‌కు చేరుకొని పోలీసుల తీరును ఆక్షేపించారు. ఈ క్రమంలో ఆయన పెంట్యాల పుల్లయ్య అరెస్టు విషయమై గోప్యతను ఎందుకు



కొనసాగిస్తున్నారని, ఏ కేసులో అరెస్టు చేశారు అనే విషయం కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా ఆయన వయస్సును కూడా పరిగణలోకి తీసుకోకుండా దౌర్జన్యంగా తరలించడం ఎందుకు జరిగిందని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా వైరా సీఐ అశోక్ ఆయనకు సమాధానం ఇస్తూ పూర్తి వివరాలు ఏసీపీ వెల్లడిస్తారని, చట్ట ప్రకారమే ఆయనని అదుపులోకి తీసుకున్నామని పేర్కొనడంతో అసహనానికి గురైన కమల్‌రాజు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. లచ్చగూడెంలో రైతు కుటుంబానికి అండగా నిలబడి న్యాయం చేయాలని కోరడం పుల్లయ్య చేసిన నేరమా అంటూ తమపై కూడా చర్యలు తీసుకోండి అవసరమైతే చంపండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా లచ్చగూడెం గ్రామంలో రైతు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి మృతిచెందిన సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో పెంట్యాల పుల్లయ్యను అదుపులోకి తీసుకున్నట్లు చింతకాని పోలీసులు ప్రాథమికంగా పోలీసులు పుల్లయ్య అరెస్టు సందర్భంగా వ్యవహరించిన తీరు నియోజకవర్గంలో రాజకీయంగా చర్చనీయంగా మారింది.

## శరవేగంగా జరుగుతున్న రొంపిమళ్ల-యండపల్లిగుట్ట రోడ్డు నిర్మాణ పనులు



మధిరరూరల్, అక్టోబర్ 24, ప్రభాతవార్త: మధిర నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మధిర మండలంలోని పలు అంతర్గత రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భారీగా నిధులు మంజూరు చేశారు. దీనిలో భాగంగా ఎంతోకాలంగా నడిచేందుకు దారిలేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన భట్టి విక్రమార్క రొంపిమళ్ల-యండపల్లి గుట్టకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.2.80కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు పనులు ప్రారంభించటం పట్ల రైతులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాల ఆవరణలో పంచాయతీ నర్సరీ మొక్కల పెంపకం

*ప్రతి వారానికి ఒక విషసర్పంతో భయాందోళనలో గిరిజన విద్యార్థులు*

దమ్మపేట రూరల్ ప్రభాతవార్త : గిరిజన విద్యార్థుల ప్రాణ రక్షణ కంటే తమ మొక్కలు ఎక్కడ రక్షణ లేకుండా పాడైపోతాయోననే ఉద్దేశ్యంతో ఏకంగా ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే నర్సరీ మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఇది పూర్తిగా పంచాయితీ ఆధ్వర్యంలో చేయాల్సిన కార్యక్రమం. మండ లంలోని నల్లకుంట గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో నర్సరీ మొక్కలను పెంచుతూ, వాటికి అవసరమైన నీటిని పాఠశాల బోరుతోనే వినియోగిస్తున్నారు. అసలే చిన్న పిల్ల లు, అందునా గిరిజన విద్యార్థులు. అదే పాఠశా లలో ఒక ప్రక్కన అంగన్‌వాడీ కేంద్రం, మరొక ప్రక్కన ప్రాథమిక పాఠశాల నడుపుచున్నారు. రెండు విభాగాల్లోనూ దాదాపుగా చిన్న వయస్సున్న గిరిజన విద్యార్థులే విద్యనభ్య సిస్తున్నారు. నర్సరీ మొక్కలను పెంచడం వలన చల్లని వాతావరణానికి చాలా సార్లు విషసర్పాలు తరచుగా పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ గిరిజన విద్యార్థులకు ఏదేని ప్రాణ నష్టం జరిగితే



అందుకు బాధ్యత వహించేవారెవరని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. గతంలో అనేకమార్లు ఈ విషయంపై అధికారు లకు మొరపెట్టుకున్నాగానీ ఎవరూ స్పందించడం లేదన్నారు. పంచాయితీ వారికి అవసరమైన మొక్కల పెంపకాలను ఏదేని ప్రదేశంలో వేసా పెంచుకోవాలి ఇలా పాఠశాల ఆవరణలో ప్రమాధకర పరిస్థితుల్లో పెంచడం ఏమి టని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల లో ఉన్న గిరిజన విద్యార్థుల ప్రాణాలకంటే పంచాయితీ వారికి మొక్కల పైనే మక్కువ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుందని గ్రామస్థులు ఆవేధన చెందారు. ఇది వరకు ఈ పాఠశాలలో ఉన్న టాయిలెట్స్ ను ఉపయోగించాలంటే ప్రాణ భయంగా ఉండేదని, గ్రామస్థులు చొరవ తీసు కోవడం వలన కొంతమేరకు టాయిలెట్స్ ను



శుభ్రపరిచారని హర్షం వ్యక్తం చేశారు. ఆ సంతో షం ఎంతోకాలం కాకముందే మళ్ళీ నర్సరీ మొ క్కలను పాఠశాల ప్రహరీకి ఆనుకొని పెంచు తుండటంతో చుట్టూ చెత్తా చెదారం పేరుకు పోయి, నాగు పాములు, ఇతరత్రా విష సర్పాలు తరచుగా పాఠశాల ఆవరణకు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదం డ్రులు ఆవేదన చెందు తు న్నారు. అంగన్‌వాడీ కేంద్రం కావడంతో గ్రుడ్లు ,బియ్యం, పప్పులు నిల్వ చేస్తారు కాబట్టి, వాట కోసం ఎలుకలు వస్తున్నాయని, వీటికోసం పాము లు కూడా వస్తున్నాయని, దానికి తోడుగా చుట్టూ చల్లని నర్సరీ మొక్కలు నీడను కల్పిస్తుండటంతో భయానకంగా మారిందని తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు.తక్షణమే పంచాయితీ అధికారులు ఈ పాఠశాల ఆవరణనుండి నర్సరీ మొక్కలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## సింగరేణి హెల్త్‌క్యాంప్

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 24 : సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా సింగరేణి సేవాసమితి, వైద్యఆరోగ్యవిభాగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మండలంలోని రామానుజవరం గ్రామంలో హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ హెల్త్‌క్యాంప్‌లో సుమారు 100మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సులోచన, వైద్యసిబ్బంది విద్యారాణి, రాము, సేవాకోఆర్డినేటర్ మారేశ్వరరావు, ఎండీ.యూసఫ్, ఆశావర్కర్ నర్సమ్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా 108వ సుందరకాండ పారాయణం

### -రామనామయంతో మారుమ్రోగిన భద్రగిరి
### -శోభాయమానంగా సుందరకాండ రామదండు శోభాయాత్ర

భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం సహకారంతో దేవస్థానం ఆవరణంలోని చిత్రకూట మండపంలో సుందరకాండ రామదండు భద్రాచలం ఆధ్వర్యంలో ఎం.ఎస్.రామారావు రచించి ఆలపించిన 108వ సుందరకాండ పారాయణం నేత్రపర్వంగా జరిగింది. మంగళ, బుధవారాలలో 106వ,107 పారాయణంలు శ్రీరామాలయంలో, ఆంజనేయస్వామి వారి ఆలయం పక్కన అత్యంత వైభవంగా జరిగాయి. కాగా గురువారం తాతగుడి సెంటర్ నుంచి శ్రీస్వామి వారి ఉత్సవమూర్తితో శోభాయాత్ర నిర్వహించారు. స్వామి వారికి పలువురు మహిళా భక్తులు హారుతుల పట్టి నీరాజనం పలికారు. శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయం వద్దకు చేరుకుని గిరిప్రదక్షణ గావించారు. శోభాయమానంగా జరిగిన శోభయాత్రలో మహిళా భక్తులంతా శ్రీరామ జయ రామ జయ జయ రామ అనే నామజపంతో భద్రగిరి మారుమోగింది. అనంతరం చిత్రకూట మండపానికి చేరుకుని పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పారాయణం ఆలకించిన భక్తజనం తన్మయత్వంతో పులకరించిపోయారు.





## కన్నులపండువగా రామయ్య కళ్యాణం

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి కళ్యాణం కన్నులపండుగగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నదీ తీరం నుండి తీర్థపు బిందెలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ నదీ జలాలను తీసుకుని శ్రీస్వామి వారి మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకస్వాములు ముందుగా శ్రీస్వామి వారి సహస్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహాత్యాన్ని భక్తులకు వివరించారు. కళ్యాణంతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోత్రధారణ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంగళాష్టకాలు, చూర్ణిక, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్యధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణ జరుగుతున్నంత సేపు కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కన్నులారా శ్రీసీతారామచంద్రస్వామి వార్లను చూస్తూ తరించిపోయారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలకు తన్మయత్వంతో పులకరించిపోయారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థాన సిబ్బంది కళ్యాణలడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.





## జిల్లాకు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ

### -మర్యాదపూర్వకంగా స్వాగతం పలికిన అధికార యంత్రాంగం

సారపాక, ప్రభాతవార్త :

భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ గురువారం చేరుకున్నారు. బూర్గంపహాడ్ మండల సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో చేరుకున్న గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటిడిఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం చేశారు. శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఈవో రమాదేవి, అర్చకస్వాములు పర్యటనకు వచ్చిన గవర్నర్‌కు సాంప్రదాయపరంగా పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటిడిఏ పీవో, ఎమ్మెల్యే, దేవస్థానం ఈవో, ఇతర అధికారులు గవర్నర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్,భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## పర్ణశాలలో వైభవంగా స్వామి వారి పునర్వసు కళ్యాణం

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :

భద్రాచలం పుణ్యక్షేత్రానికి అనుబంధ దేవాలయమైన దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గురువారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామి వారి మాసకళ్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రతి నెల స్వామి వారి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రం రోజున పర్ణశాల దేవాలయంలో మాసకళ్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఉదయం స్వామి వారికి విశేష తిరుమంజనం, వైదిక కార్యక్రమాలను అర్చకస్వాములు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. పర్ణశాలకు వచ్చిన యాత్రికులతో పాటు చుట్టుపక్క గ్రామాలకు చెందిన అనేకమంది భక్తులు స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. భక్తులకు తీర్థప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇంచార్జ్ అనిల్‌కుమార్, భార్గవాచార్యులు, శేషం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, భాస్కరాచార్యులు, నర్సింహాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాన్ని ఆవిష్కరించిన గవర్నర్

భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలోని శ్రీరామాయణదారులు ఎస్‌టీజీ అంతర్వేది కృష్ణమాచార్య రచించిన



ఉపపురాణ దర్శనం అనే గ్రంధాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు. గురువారం జిల్లా పర్యటన నిమిత్తం ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న గవర్నర్‌ను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటిడిఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేశ్వ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిలకు ఆర్థిక సహాయం

### -అందజేసిన ఐటిడిఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, ప్రభాతవార్త :

గిరిజన సంక్షేమ శాఖ గురుకులం పాఠశాల, కళాశాలలో చదివి నీట్ ఎంట్రెన్స్ పరీక్ష రాసి అత్యుత్తమ ర్యాంకులతో ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించడం చాలా గర్వకారణమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించిన బాలికలను ఆయన అభినందిస్తూ ప్రోత్సాహకం కింద ఒక్కొక్కరికి ఐటిడిఏ రిలీవ్ ఫండ్ నుంచి రూ.50వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలను అభినందిస్తూ ఇంతటితో చదువు అయిపోయిందని సంతోషించవద్దని, బాగా



చదివి పీజీలో సీట్లు సంపాదించి అత్యుత్తమ మార్కులతో డాక్టర్లుగా నియమితులై మీకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, కళాశాలకు, మీ గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకుని రావాలని ఆయన అన్నారు. ఖాళీ సమయంలో తప్పనిసరిగా మీ కింద తరగతి పిల్లలకు తాత్కాలిక ఫ్యాకల్టీలుగా పనిచేసే తల్లిదండ్రుల మీద భారం మోపకుండా కొద్ది గొప్ప సంపాదించుకోవాలని ఆయన వారికి సూచిస్తూ మరి ఒకసారి అందరికి అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజ్, సున్నం రాంబాబు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి ఖమ్మం విజయలక్ష్మి, ఆర్‌సీవో నాగార్జునరావు, ఏసీఎంవో రమణయ్య, బాలికల యొక్క తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంవీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటపుల్లయ్య

భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :

భద్రాచలం మండల రవాణా శాఖ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా సంఘం వెంకట పుల్లయ్య గురువారం బాధ్యతలను చేపట్టారు. ముందుగా శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఏర్పాటు చేసిన ప్రాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. భద్రాద్రి రామయ్య పాదాల చెంత పనిచేసే అదృష్టం వరించడం నా పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని, మండల ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని అన్నారు.

**-మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీఎన్‌జీవోస్**

ఈ సందర్భంగా ఎంవీఐ సంఘం వెంకటపుల్లయ్యను టీఎన్‌జీవోస్ భద్రాచలం డివిజన్ ప్రెసిడెంట్, సెక్రటరి డెక్కా నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణల ఆధ్వర్యంలో కార్యవర్గం మర్యాదపూర్వంగా కలిశారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాచలంలో పెరుగుతున్న రవాణా ట్రాఫిక్ దృష్ట్యా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించి సక్రమంగా వారి గమ్యస్థానాలకు చేరాలని కోరుకుంటూ ఆ విధంగా నడిపించుటకు నిత్యం కృషి చేసే వ్యక్తుల్లో వెంకటపుల్లయ్య ఒకరిని కొనియాడారు. కార్యక్రమంలో ట్రెజరర్ పడిన నరసింహారావు, గాంధీ, శ్రీనివాస్, అంజిబాబు, హరి, సత్యనారాయణ, రామకృష్ణ, పాల్గొన్నారు.



# మానవతా దృక్పథంతో పదివేల రూపాయల చెక్కును అందించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం,అక్టోబర్ 24, ప్రభాతవార్త:
తమానవతా దృక్పదంతో సొంత ఊరు వెళ్తున్న దాసరి రమాదేవి అనే మహిళకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పదివేల రూపాయల చెక్కును అందజేశారు. మతిస్థిమితం నుంచి కోలుకున్న దాసరి రమాదేవి, తల్లి దాసరి కుమారి, కుటుంబసభ్యులతో గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్‌ను కలిశారు. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం ప్రకాశం జిల్లా పొంగులూరు గ్రామానికి చెందిన 35 సంవత్సరాల వయస్సు గల దాసరి రమాదేవి మతిస్థిమితం లేకుండా పెద్ద గోపతి గ్రామంలో తిరుగుతుండగా పోలీసు వారు అన్నం ఫౌండేషన్‌కు ఆమెను అప్పగించగా గత రెండున్నర సంవత్సరాలుగా బాగోగులు చూస్తూ చికిత్స అందించడ జరిగిందని, ప్రస్తుతం



కోలుకొని కుటుంబ సభ్యుల వివరాలు తెలుపగా, కుటుంబ సభ్యులను సంప్రదించి ఇప్పుడు సొంత ఇంటికి తీసుకువెళుతున్నారని అన్నం ఫౌండేషన్ స్థాపకులు అన్నం శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. దాసరి రమాదేవి తల్లి దాసరి కుమారితో మాట్లాడి కుటుంబం నేపథ్యం వివరాలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ మానవతా దృక్పదంతో ఖర్చుల నిమిత్తం 10వేల రూపాయల చెక్కును అందజేశారు. మతి స్థిమితం కోల్పోయిన సమయంలో చికిత్స అందించి, మా కుటుంబ సభ్యులతో నన్ను చేర్చిన అన్నం ఫౌండేషన్‌కు మానవతా దృక్పదంతో సహకారం అందించిన జిల్లా కలెక్టర్‌కు దాసరి రమాదేవి, ఆమె కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అన్నం ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అన్నం శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో దాసరి రమాదేవి, తల్లి దాసరి కుమారి, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## నవంబర్ 5న స్థానిక సంస్థలలో వెనుకబాటుతనంపై ప్రజాభిప్రాయ సేకరణ

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్**

ఖమ్మం, అక్టోబర్ 24, ప్రభాతవార్త:
నవంబర్ 5న స్థానిక సంస్థలలో వెనుకబాటుతనంపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని దీనిలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, మేధావులు హాజరై వారి అభిప్రా యాలను తెలియజేయాలని, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేం కు స్థానిక సంస్థలలో వెనుకు బాటుతనం స్వభావం ప్రభావాన్ని, సమకాలిన, క్షన్న మైన, అనుభవపూర్వక విచారణను నిర్వహి ంచేందుకు ప్రత్యేక బిసి కమీషన్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, నవంబర్ 5న ఉద యం 10గంటల నుంచి సాయంత్రం 4గం టల వరకు ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల అభిప్రాయాలు తెలుసు కునేందుకు ప్రజా భిప్రాయ సేకరణ కార్య క్రమం నిర్వహి ంచడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, కుల సంఘాలు ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయా లని, ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాలను అభ్యర్ధనలను వ్రాత పూర్వకంగా వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు 6సెట్లలో తెలుగు లేదా ఆంగ్లం ఏదైనా భాషలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమీషన్‌కి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఏ.టి.సి కోర్సుల అడ్మిషన్లకు అక్టోబర్ 30 తుది గడువు

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ**

**172 సీట్లకు గాను గురువారం నాటికి 53 సీట్లు ఖాళీ అదనపు కలెక్టర్**

ఖమ్మం, అక్టోబర్ 24, ప్రభాతవార్త:
ఖమ్మం జిల్లాలోని ఐటిఐలలో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సుల ప్రవేశాల కొరకు అక్టోబర్ 30 తుది గడువు అని,ప్రవేశానికి ఆసక్తి గలవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఐటిఐ కళాశాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లను ప్రారంభించిందని, మన జిల్లాలో ఉన్న ఐటిఐలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరై, 6కోర్సులలో 172 సీట్లు అడ్మిషన్స్ ప్రారంభించడం జరిగిందని అన్నారు. గురువారం నాటికి 172 సీట్లలో 119 సీట్లు భర్తీకాగా,53 సీట్లు మాత్రమే ఖాళీ ఉన్నట్లు, ఈ కోర్సులలో ఉపాధి అవకాశాలు ఖచ్చితంగా ఉంటాయని అదనపు కలెక్టర్ అన్నారు. జిల్లాలోని ఏటిసి అడ్మిషన్స్ పొందేందుకు అక్టోబర్ 30 చివరి తేది అని తెలిపారు.10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఏటిసి కోర్సులు పొందేందుకు అర్హులన్నారు. జిల్లాలో ఒక సంవత్సరం కాలపరిమితి గల మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్



కంట్రోల్ అటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, అర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్ కోర్సులు, రెండు సంవత్సరాల కాలపరిమితి గల బేసిక్ డిజైనర్ అండ్ పర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్) అడ్వాన్సుడ్ సిఎన్‌సి మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులలో సీట్లు ఉన్నాయని తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులలో జాయిన్ అయ్యేందుకు అడ్మిషన్ కోసం ఐటిఐ.తెలంగాణ.గౌట్.ఇన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో (పదవతరగతి మోమో, బోనఫైడ్ సర్టిఫికెట్, కుల దృవీకరణ పత్రం, ఆధార్‌కార్డ్) ఖమ్మం ఐటిఐ కేంద్రంలో సంప్రదించాలని ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9100852344, 7095739332లకు ఫోన్ చేయాలని అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## నవంబర్ 2లోపు కళాశాల వసతి గృహాలకు ఫర్నిచర్ ఇతరత్రా సరఫరాకు టెండర్లు దాఖలు చేయాలి

**ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్**

ఖమ్మం, అక్టోబర్ 24, ప్రభాతవార్త:
నవంబర్ 2లోపు ఖమ్మం జిల్లాలో ఉన్న 11 కళాశాల వసతి గృహాలకు డ్రైనింగ్ టేబుల్స్,డైనింగ్ బెంచీలు, మైక్‌సెట్స్,ప్రెషర్ కుకర్స్,అల్మారాలు,వెట్ గ్రైండర్స్, సరఫరాకు ఆసక్త గల టెండర్ దారులు సీల్డ్ టెండర్లు దాఖలు చేయాలని భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల టెండర్ దారులు టెండర్‌ఫారంలను ఉప సంచాలకుల వారి కార్యాలయం, జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఖమ్మం నుంచి అక్టోబర్ 25 నుంచి నవంబర్ 2వరకు కార్యాలయ పనివేళలో ఉదయం 11.00గంటల నుండి సాయంత్రం 5.00గంటల వరకు రుసుము చెల్లించి పొందాలన్నారు. సీల్డ్ టెండర్లను నవంబర్ 2 సాయంత్రం ఐదు గంటల లోపు సమర్పించాలని, టెండర్లు ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ భద్రాచలం సమక్షంలో నవంబర్ 4న మధ్యాహ్నం12గంటలకు తెరుస్తారని, పూర్తి వివరాలకు 9440640070, 9441908672 ఫోన్ నెంబర్లకు ఉప సంచాలకుల కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని ప్రాజెక్ట్ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




**ఖమ్మం, కార్పొరేషన్, రఘునాథపాలెం, కల్చరల్, ఖమ్మం రూరల్**

## భరతనాట్యంలో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం విద్యావిభాగం,అక్టోబర్ 24, ప్రభాతవార్త:




భరతనాట్య పోటీలలో సర్వజ్ఞ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరచి పలు బహుమతులను పురస్కారాలను గెలు పొందారు. సర్వజ్ఞ విద్యార్థులు వై.వర్ష,లక్షణ్య కుమరేష్, జి.మాన్వి, జి.ఆద్య, పి.యోగ్నశ్రీ,హైదరబాద్ వేదాద్రిలో నిర్వహించిన పోటీలలో పాల్గొని వివిధ బహుమతులను అందుకున్నారు. నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ, శ్రీ మువ్వ గోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన ఈ భరత నాట్య పోటీలలో ఐదవతరగతి చదువుతున్న వై.వర్ష, అరవతరగతి చదువుతున్న లక్షణ్య కుమరేష్, జి.మాన్వి, జి.ఆద్య, పి.యోగ్న శ్రీవిద్యార్థులు బహుమతులను అందుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన భరతనాట్య పోటీలలో వి.యోగ్నశ్రీ స్వర్ణ నంది పురస్కారం గెలుచుకుంది. అలాగే వేలాద్రిలో నిర్వహించిన భరతనాట్య పోటీలలో వై.వర్ష, లక్షణ్య కుమరేష్, జి.మాన్వి, జి.ఆద్య విద్యార్థులు నాట్యకుసుమం పురస్కారం అందుకున్నారు. ఇంతటి ప్రతిభను కనబరిచిన సర్వజ్ఞ విద్యార్థులకు డైరెక్టర్స్ ఆర్.వి.నాగేంద్రకుమార్, నీలిమ అభినందనలు తెలియజేశారు.

## నగరపాలక సంస్థ అధికారులు విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్**

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 24, ప్రభాతవార్త:
ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో అధికారులు విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. గురువారం ఖమ్మం నగరపాలక సంస్థలో నగరపాలక సంస్థ కార్యకలాపాలపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ విధానం, ఖాళీస్థలాలు, డ్రైయిన్ల మరమ్మత్తు పనుల గుర్తింపు, పారిశుద్ధ్య కార్మికుల హాజరు, అక్రమ నిర్మాణాల సర్వే, వాణిజ్య భవనాల పన్ను అసెస్మెంట్, పన్ను వసూలు వంటి పలు అంశాలపై కలెక్టర్ చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణపై కలెక్టర్ సమీక్షిస్తూ నగరంలో డివిజన్ వారీగా కేటాయించిన పారిశుద్ధ్య సిబ్బంది, ఎక్కువగా పారిశుద్ధ్య ఇబ్బందులు వచ్చే డివిజన్,చెత్త తరలింపు చర్యలు మొదలగు వివరాలను తెలుసుకున్నారు.నగరంలో చాలా వరకు పారిశుద్ధ్య సిబ్బంది లెక్కలు తప్పుగా నమోదవుతున్నాయని క్షేత్రస్థాయిలో పద్ధతి మార్చుకోని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంపై కలెక్టర్ సమీక్షిస్తూ ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాల సర్వే చేపట్టాలన, పునాదుల దశ, స్లాబ్ దశ, నిర్మాణం పూర్తయిన అక్రమ నిర్మాణాల వివరాలు సేకరించాలని వెంటనే తొలగిం చాలని అక్కడ అక్రమ నిర్మాణాలు తొలగించినట్లు డిస్ప్లే చేయాలని కలెక్టర్ సూచించారు. కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్న బిల్డర్లు, కాంట్రాక్టర్లను గుర్తించి వారిని బ్లాక్ లిస్ట్ చేయాలని, ప్రభుత్వ నిర్మాణ పనులకు సంబంధించి ఎటువంటి కేటాయింపులు చేయవద్దని అన్నారు. రోడ్డు ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుకు ప్రణాళిక రూపొందించుకోవాలని ముందుగా నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగర వ్యాప్తంగా ఉన్న ఫ్లెక్సీ,హోర్డింగ్ బోర్డుల ముద్రణ వ్యాపారులకు కార్పొరేషన్ అనుమతి లేకుండా ఎక్కడ బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు ప్రదర్శించడానికి వీలులేదని స్పష్టమైన ఆదేశాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. టౌన్‌ప్లానింగ్ విభాగం మానవత్వంతో పనిచేయాలని ఎక్కడ నోటిసులు ఇవ్వకుండా ఎటువంటి కూల్చివేతలకు పాల్పడవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల గుర్తింపు విషయంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడవద్దని అన్నారు. అక్రమ భారీ నిర్మాణాలు నిర్మించే సమయంలో ఆపకుండా ఏంచేస్తున్నారని అధికారులపై కలెక్టర్ అగ్రహం వ్యక్తం చేశారు.రెవిన్యూ వసూళ్లపై కలెక్టర్ సమీక్షిస్తూ అక్రమ హోర్డింగులు ఫ్లెక్సీలపై భారీగా ఫైన్ విధించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ షఫీఉల్లా, మున్సిపల్ ఇఇ క్రిష్టలాల్, ఏసిపి వసుంధర, పర్యవేక్షకులు విజయానంద్, శానిటరీ సూపర్‌వైజర్, సాంబయ్య, రెవెన్యూ అధికారి జి.శ్రీనివాసరావు, సి సెక్షన్ పర్యవేక్షకులు కె.శ్రీనివాసరావు, బిల్డింగ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, ఇంజనీరింగ్ అకౌంట్స్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మునగ సాగుతో ఎన్నో లాభాలు

**రైతులతో అవగాహన**

**సమావేశంలో ఎంపిడిఓ రామకృష్ణ**

**పల్లె ప్రకృతి వనాల పరిశీలన**

**తొలగించిన కోనో కార్పస్**

**మొక్కలు**

**పెద్ద మొక్కలు నాటాలని ఆదేశం**



*పినపాక, అక్టోబర్ 24, ప్రభాతవార్త*

రైతులు సంప్రదాయ సాగు విధానంలో వరి, పత్తి, మిరప వంటి పంటలనే నమ్ముకుని సాగు చేస్తున్నారని, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి ఆర్థిక లాభాలు ఆర్జించవచ్చునని ఎంపిడిఓ రామకృష్ణ సూచించారు. మండలంలోని ఏడూళ్ల బయ్యారం పంచాయతీలో ఎంపిడిఎ రామకృష్ణ, ఎంపిఓ కె.వెంకటేశ్వరరావు మునగ సాగుపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు.

ముఖ్యంగా మునగ సాగుపై అవగాహనా కల్పించారు. మునగ సాగుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు, ప్రోత్సహకాలు కల్పిస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మునగ సాగు విధానాలు, మార్కెటింగ్ అంశాలను వివరించి రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. మండలంలో మునగ సాగుకు ఆసక్తి ఉన్న రైతులు ఎంపిడిఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అనంతరం తోగ్గూడెం, ఏడూళ్ల బయ్యారం పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శుల, సిబ్బంది పని తీరును అభినందించారు ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ముఖ్యంగా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల్లో తొలగించిన కోనో కార్పస్ మొక్కల స్థానంలో ఆయా గ్రామ పంచాయతీ నర్సరీల్లో ఉన్న ఎత్తైన మొక్కలను వాటి స్థానంలో నాటాలని సూచించారు. అలాగే పంచాయతీలో పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు, చెత్త సేకరణ పనుల్లో అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా మల్టీ పర్పస్ వర్కర్లు విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జైపాల్ రెడ్డి, సాంబశివరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మల్లారం పంచాయతీలో అవగాహన సమావేశం:** మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీలో ఎంపిడిఎ రామకృష్ణ, ఈజిఎస్ సిబ్బందితో కలిసి మునగసాగుపై రైతులు అవగాహన సమావేశం నిర్వహించారు. మునగ సాగు చేసినట్టయితే వాణిజ్యపరంగా లాభాలు గడించే అవకాశం ఉందని రైతులకు సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చని అన్నారు. మునగ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఎంపిడిఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పంచాయతీ సిబ్బంది స్థానికులకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తరుణ్, ఈజిఎస్ సిబ్బంది దొరబాబు, సుజాత, వెంకటేశ్వర్లు, రాము, రాములు, మల్లారం రైతులు పాల్గొన్నారు.

# సొసైటిలో ఆర్థిక స్వలంబన సాధించాలంటే ఆదాయ వనరులను పెంచుకోవాలి

**-ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి**



*సంగెం, అక్టోబర్ 24, ప్రభాతవార్త*

సహకార సంఘాలు ఆర్థిక స్వలంభన సాధించాలంటే ఆదయ వనరులను పెంచుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సూచించారు. సంగెం మండల పరిధిలోని సంగెం మండల కేంద్రంలో పిఎసిఎస్, కాపులకనపర్తి, రైతు సేవా సహకార సొసైటి సంఘాల పాలక మండలి సభ్యులు సొసైటి అధికారులతో కలిసి సహకార సంఘాల అభివృద్ధి కార్యక్రమాలపై గురువారం రోజున అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల యొక్క ఆర్థిక లావాదేవీలపై రైతు రుణాలు సంఘాల పురోగాభివృద్ధిపై సంఘ సభ్యుల వాతావరణంపై పలు కీలక అంశాలపై పాలకమండలి అధికారులతో సొసైటిలను ఏవిధంగా బలోపేతం చేయాలనే అంశాలపై వారితో చర్చించారు. వీటి పురోగాభివృద్ధిపై పలు రకాల సూచనలు చేశారు. అనంతరం ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలు ఆర్థికంగా భలోపేతం చెందాలంటే అందుకు కావాల్సిన వనరులను పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దీనికి సంఘాల పాలక మండలి సభ్యుల సహకారం ఉంటేనే సాధ్యపడుతుందని సొసైటీలు బలోపేతం చెందినప్పుడే రైతులకు ఎక్కువ మొత్తంలో రుణాలు ఇచ్చే స్థాయికి సంఘాలు ఎదుగుతాయని అందుకు రైతులు కూడా వ్యవసాయ రంగంలో రానిస్తారని మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగానికి ఆదునిక యంత్రాలను అందుబాటులోకి సహాకర సంఘాలు తీసుకురావాలని రైతుల్లో వారికి అవగాహన పెంచుతూ వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా పాలక మండలి కృషి చేయాలని అన్నారు. సహకార సంఘాల పాలక మండలి సభ్యులు, అధికారులు సిబ్బంది ఒక టీమ్‌గా పనిచేసి రైతుల సమగ్రాభివృద్ధికి తోడ్పడాలని సొసైటిలు ఏర్పాటు చేసినదే రైతుల సంక్షేమం కోసం భరోసా రైతులకు కలిగినప్పుడే సొసైటిల మీద నమ్మకం కలుగుతుందని తెలిపారు. సొసైటిలో సభ్యుల సంఖ్య పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రైతు కుటుంబాలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ద్యేయమని మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చెసి దళారుల నుండి రైతులకు రక్షణ కల్పించాలని సొసైటీలను పటిష్ట పరిచి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నదే ప్రభుత్వ ద్యేయమని తెలిపారు. రైతుల జీవితాలలో వెలుగు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రైతుల సంక్షేమానికి వారి కుటుంబాల అభివృద్ధికి సొసైటిలు సేవా దృక్పథంతో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక యంత్రాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ భూ పరీక్ష కేంద్రాలను రాభోయే రోజుల్లో సొసైటీలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేరళ, గుజరాత్ రాష్ట్రాలలో రైతులకు ఎల్ఈడీ తెరలపై, వ్యవసాయ రంగ పద్ధతలుపై రైతులకు ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై గ్రామాల్లో ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. రైతుల కుటుంబాలను వారి అభివృద్ధిపై సొసైటిలు సేవా దృక్పథంతో, చిత్తశుద్ధితో పనిచేయాలని సహకార పాలక మండలి సభ్యులకు, అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని త్వరలో సహకార సంఘల్లో తీసుకున్న రుణాలు అందిరికి మాఫీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా డీసీవో నీరజ జిల్లా సహకార సంఘం ఆర్థిక లావాదేవీలపై ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాపులకనపర్తి సహకార సంఘ సీఈవో రాసమల్ల రమణాచారి సొసైటిల చైర్మన్‌లు దొమ్మటి సంపత్‌గౌడ్, వేల్పుల కుమారస్వామి, సోలగూడి భాస్కర్, బానోతు కిషన్, ఎం.శ్రీనివాస్, తదితర డైరెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

# అసైన్డ్ భూముల ధరణి పట్టాలను రద్దు చేయాలి

**-డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**మారుపాక అనిల్ కుమార్**

*ప్రభాతవార్త ఎల్కతుర్తి:*

అసైన్డ్ బూములను బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ధరణి పేరుతో అక్రమంగా పట్టాలు చేసిన భూమి పట్టాలను రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో భూమీలేని దళితులకు పట్టాలిచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా దళితులు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో అంగబలం ఆర్థిక బలం ఉన్న వ్యక్తులతో రెవెన్యూ యంత్రాంగం కుమ్మక్కై ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టాలు చేసుకున్నారని, దళితులకు ఇచ్చిన భూములను అక్రమంగా పట్టాలు చేసిన రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఊట్కూరి రాములు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్, జిల్లా సహాయ కార్యదర్శి శనిగరపు రాజకుమార్, నాయకులు తండ ముండయ్య, మర్రి విజయ్, రేణిగుంట్ల సాంబయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నగరంపల్లి రైతుల ఇంటి స్థలాలపై స్పందించని సింగరేణి అధికారులు

**-అధికారుల తీరుపై భూ నిర్వాసితుల నిరసన**

**-ఓసిత్రీ ముందు ఆందోళన**


*గణపురం, అక్టోబర్ 24, ప్రభాతవార్త*



నగరంపల్లి గ్రామ రైతుల ఇంటి స్థలాలలపై సింగరేణి అధికారులు పట్టించుకోవడంలేదని నగరంపల్లి భూ నిర్వాసితులు గురువారం ఓసిత్రీ ముందు ఆందోళన చేపట్టారు. ఓసిత్రీ నిర్వాసిత గ్రామమైన నగరంపల్లిలో సుమారు 83 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి సంబంధించిన భూమిని సింగరేణి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సర్వే నిర్వహించి రామప్ప కాలనీ వెనుక భాగంలో 83 మంది నిర్వాసితులకు పట్టాలిచ్చి ఐదు నెలలు గడిచిన ఇప్పటివరకు కేటాయించిన భూమిని చదును చేయకుండా వదిలివేసారు. నిర్వాసితులందరూ రోజుల తరబడి సింగరేణి అధికారుల చుట్టూ తిరిగిన ఎవరూ స్పందించకపోవడంతో ఆందోళన చేపట్టారు. తమకు వెంటనే భూమిని చదును చేసి ప్లాట్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. తమ భూములను స్వాధీనం చేసుకున్న సింగరేణి అధికారులు మమ్మల్ని ఈసడించుకుంటున్నారని కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని తమ గోడును పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు తమకు కేటాయించిన ఐదు ఎకరాల స్థలాన్ని చదును చేసి నిర్వాసితులందరికి అప్పగించాలని వారు డిమాండ్ చేశారు.

## మృతురాలి కుటుంబానికి పుట్ట మధు పరామర్శ

*మల్హర్‌రావు, అక్టోబర్ 24, ప్రభాతవార్త*



మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన పర్శ ఓదమ్మ కుటుంబ సభ్యులను గురువారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మల్కా భాస్కరరావు, ఉపాధ్యాయులు కటకం ప్రకాష్ రావు మరియు బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు జాగరి హరీష్, మాజీ ఎంపిటీసీ సభ్యురాలు రావుల కల్పన మొగిలి, గ్రామశాఖ అధ్యక్షులు అన్నమనేని మధుసూధన్ రావు నాయకులు నారమల్ల నవీన్, కామ బాపు, తిక్క వినయ్, సందీప్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మెండ్రాతి రవి మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు

*నర్సంపేట, అక్టోబర్ 24, ప్రభాతవార్త*

సిపిఐ నర్సంపేట మండల సమితి మెండ్రతి రవి మరణం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంజాల రమేష్ అన్నారు. మాదన్నపేట రోడ్డు సిపిఐ కాలనీవాసీ సిపిఐ నర్సంపేట మండల సమితి సభ్యులు అఖిల భారత యువజన సమైక్య జిల్లా నాయకులు డెంగ్యూ జ్వరంతో ఉదయం ఎంజిఎం ఆసుపత్రిలో మరణించారు. ప్రార్ధివ దేశంపై కమ్యూనిస్టు ఎర్రజెండా కప్పి ఆయనకు ఘనమైన నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు గడ్డం యాకయ్య, మియాపురం గోవర్ధన్, కందిక చెన్నకేశవులు, పాలక కవిత, సిపిఐ నాయకులు గడ్డం నాగరాజు, బాదరబోయిన యాదగిరి, పిట్టల సతీష్ వడ్లకొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయసమ్మేళనం



*మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 24 :*
మణుగూరు మండలం రామానుజవరం గ్రామపంచాయతీలోని కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఆత్మీయసమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పినపాక నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో పాయం వెంకటేశ్వర్లును, పార్లమెంటు ఎన్నికల్లో పోరిక బలరాంనాయక్‌ను భారీమెజార్టీతో గెలిపించుకున్న సందర్భంగా ఆత్మీయసమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యరాజ్యసమితి దినోత్సవం



*మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 24 :*
మణుగూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐక్యరాజ్యసమితి దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత విద్యార్థులతో లయన్స్‌క్లబ్ సెక్రెటరీ షేక్ మీరాహుస్సేన్ శాంతి ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ నల్లగట్ల సత్యప్రకాష్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ దుస్సా సమ్మయ్య, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీహక్కుల చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే పాయంకు పెద్దిపల్లి వలస గిరిజనుల వినతి



*మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 24 :*
పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును గురువారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్‌లో పెద్దిపల్లి వలస ఆదివాసీ గిరిజనులు కలిసి తమ పోడు భూములకు పట్టాలిప్పిస్తానని అటవీహక్కుల చైర్మన్ మండారి సతీష్ డబ్బులు తీసుకొని మోసం చేశారని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## దీపావళి మెగా వాలీబాల్ టోర్నమెంట్

*మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 24 :*



పినపాక మండలం గోపాలరావుపేట యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీపావళి మెగా వాలీబాల్ టోర్నమెంటు ప్రచారపోస్టర్‌ను గురువారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పీర్నాకి నవీన్, గోపాలరావుపేట యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతున్నారు

### సిండికేట్ వైన్ షాప్‌లపై చర్యలు తీసుకోవాలి



*టేకులపల్లి, ప్రభాతవార్త, అక్టోబర్ 24:*
టేకులపల్లి మండలంలోని వైన్ షాప్‌లు కుమ్మక్కై సిండికేట్‌గా బెల్ట్ షాపులకు అధికధరలకు విక్రయిస్తున్నాయని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు రవి రథోడ్, భూక్య శ్రీను, ధరవత్ సురేష్ అన్నారు. ఇల్లందు ఎక్సైజ్‌శాఖ కార్యలయంలో గురువారం వినతి పత్రం అంజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...టేకులపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీ ధరలకంటే 50 నుంచి 60 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. మండలంలో అత్యధికంగా బెల్ట్ షాప్‌లు పెరిగిపోయయాని పేర్కొన్నారు. వైన్ షాపులు పేరుకే ఉన్నాయని కావల్సిన బ్రాండ్‌లు బ్లాక్‌లో సిండికెట్ అయ్యి అత్యధిక ధరలకు అమ్ముతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోని అత్యధిక ధరలు అమ్మే వైన్ షాప్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన నాయకులు వెంకటేష్, నాగరాజు, రమేష్, రాంబాబు, పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

### - అనుమానిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలి



*మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 24 :*
నేరాల నియంద్రణకే పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి అన్నారు. మణుగూరు మున్సిపాలిటీలోని శేషగిరినగర్ గ్రామంలో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలను అతివేగంతో అజాగ్రత్తగా నడపవద్దన్నారు. ప్రమాదాలు జరగడం వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుపడితే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లోకి అనుమానిత



వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపట్ల శ్రద్ధ వహించాలన్నారు. వాహనదారులు అన్ని దృవీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. సరైన పత్రాలు లేని 37 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, ఒక కారు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్సైలు మేడా ప్రసాద్, రాజ్‌కుమార్, తిరుపతి, రవూఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఇల్లెందు, గుండాల, టేకులపల్లి

## సీహెచ్‌పీలో సహపంక్తి భోజనాలు



*ఇల్లెందు అర్బన్, ప్రభాతవార్త:*
సింగరేణి ఇల్లెందు ఏరియాలోని సీహెచ్‌పీలో కార్మికులకు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. గురువారం సీహెచ్‌పీ వద్ద శరన్నవరాత్రి వేడుకల అనంతరం ప్రతి సంవత్సరం కార్మికులకు ఈ సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేస్తూవస్తున్నారు. అందులో బాగంగా సహపంక్తి భోజనాలను ఏరియా జీఎం జాన్ ఆనంద్, క్రిష్టఫర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని తొమ్మిదిరోజుల పాటు విషేషపూజలను నిర్వహించిన అనంతరం ఈ భోజనాలను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవి.మోహన్‌రావు, వర్క్‌షాప్ డీజీఎం నాగరాజు, ఇంజినర్ పవన్, నాగేశ్వర్‌రావు, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిథ్య సంఘం ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లెందులో పర్యటించిన సివిల్ ట్రైనీ అధికారులు



*ఇల్లెందు అర్బన్, ప్రభాతవార్త:*
సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జేకే ఉపరితలగనిలో సివిల్ ట్రైనీ అధికారులు పర్యటించారు. గురువారం ప్రాజెక్టె అధికారి కృష్ణమోహన్ వ్యూ పాయింట్ ద్వారా వారికి జేకే ఉపరితలగనిలో జరుగుతున్న పనులకు సంబందించి వివరించారు. బ్లాస్టింగ్, లోడింగ్ విదానం, బొగ్గు రవాణా, పర్యావరణ పరిరక్షణకు సంబందించి ఓబీలలో ప్లాంటేషన్‌కు సంబందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఇ,యస్, తేజస్వీని, ఐ.ఎఫ్,యస్, విపుల్ సింఘాల్, ఐ.ఎఫ్,యస్ అనిత మీనా, ఐ.ఆ.యస్,అల్తమాష్ ఘజీ, ఐ.ఎ.ఎయస్ సర్వే అధికారి నాగేశ్వర్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుదాకర్ పాల్గొన్నారు.

## గురుకులంలో టిజిటి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు ఆహ్వానం

*ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త:*
ఇల్లెందు తెలంగాణ మైనార్టీ గురుకులంలో బాలుర-1 ఖాళీగా ఉన్న టిజిటి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టిజిటి ఇంగ్లీష్, టిజిటి సోషల్ విభాగాలో ఖాళీలు ఉన్నాయని సంబందిత సబ్జెక్టులలో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ, బిఈడీ, టెట్ అర్హత కలిగి ఉన్న వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణ మైనారిటీస్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషనల్ సొసైటీలో టీచింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తుదారులకు 18 నుంచి 44 సంవత్సరాల వయస్సుగల వారు అర్హులన్నారు. అర్హతగల వారు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4గంటల వరకు పూర్తి స్థాయి సర్టిఫికేట్స్ జిరాక్స్‌లతో ఇల్లెందు తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల యందు ఇవ్వాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9515523864, 9110360408, 9866140158 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# మండలంలో ఎమ్మెల్యే జారె సుడిగాలి పర్యటన

### డ్వాక్రా సంఘాలకు రూ.4.24కోట్ల రుణాలు పంపిణీ
### మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ
### కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

అశ్వారావుపేట రూరల్, (ప్రభాతవార్త): స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పలు కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం ద్వారా లబ్దిదారులకు మంజూరి కాబడిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నేరుగా వారికి అందజేశారు. ఈక్రమంలో ముందుగా మండలంలోని మొద్దులగూడెంలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్థులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు



వివరించగా వాటి పరిష్కారం దిశగా కృషిచేస్తానని, సిసి రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సైడ్ డ్రైన్ పనుల పరిశీలన:



అశ్వారావుపేట పట్టణంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే జారె పరిశీలించి పనుల్లో పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించి పటిష్టంగా డ్రైనేజీ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

గోశాలను పరిశీలించిన జారె

మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులో వేంచేసి ఉన్న శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి దేవాలయం ఆవరణలో గల గోశాలను ఎమ్మెల్యే జారె పరిశీలించారు. గోశాల



విషయంపై అటవీ అధికారులతో మాట్లాడతానని, గోశాల షెడ్ నిర్మాణానికి ఏ ఇబ్బంది లేకుండా చూస్తానని అన్నారు.

డ్వాక్రా మహిళలకు రూ.4.24కోట్ల చెక్కును



అందజేసిన ఎమ్మెల్యే:

ఇందిరా మహిళ శక్తి పథకం ద్వారా స్వయం సహాయక బృందాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.4.24కోట్లకు చెందిన చెక్కును స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ లబ్దిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఈ నిధులను సద్వినియోగం చేసుకొని ప్రగతి మండల సమాఖ్య సభ్యులు ఆర్థికంగా ముందుకు వెళ్ళాలని అన్నారు. అలాగే మహిళలు మీ వంతుగా మారకద్రవ్యాల నియంత్రణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంకా ప్రసాద్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అశ్వారావుపేట, భద్రాచలం రోడ్డు వెడల్పు చేస్తున్న నేపథ్యంలో ఇరువైపులా ఉన్న వ్యాపారస్థులకు ఇబ్బందులు లేకుండా వెసులుబాటు కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే జారె సానుకూలంగా స్పందించారు.




**అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి**

## మునగ , వెదురు పంటల సాగుపై శిక్షణ



దమ్మపేట, అక్టోబర్ 24 (ప్రభాతవార్త): మండలంలోని నాగుపల్లి రైతువేదికలో గురువారం రైతులకు మునగపంట, వెదురుపంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ఆదేశాల మేరకు రైతులకు అదనపు ఆదాయం కల్పించే ఈ పంటలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈక్రమంలో ఎడిఎ పి రవికుమార్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వచ్చే పంటలైన మునగ పంటను సాగు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాలలో ఆగ, మగ వారిలో ఎక్కువగా రక్తహీనత రావడం జరుగుతుందని కావున మునగ ఆకు మరియు మునగ ఉత్పత్తులను ఆహారంలో భాగంగా తీసుకుంటే రక్తహీనత తగ్గుతోందని వివరించారు. అదే విధంగా వెదురు సాగు వలన కూడా ఎంతో ఆదాయం వస్తుందని ఇందుకు గాను ఐజీఎస్ ద్వారా రాయతీలు కల్పిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

## మలేషియాలో బిజీ బిజీగా తుమ్మల



దమ్మపేట, అక్టోబర్ 24 (ప్రభాతవార్త): తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు మలేషియా పర్యటనలో బిజీ బిజీగా ఉన్నారు. పామాయిల్ పంటపై మరింత లోతైన అధ్యయనంతో పాటు పామాయిల్ పంటకు ఇంకా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులను సాధించే విధంగా మూడు రోజుల పర్యటనకు మలేషియాకు తుమ్మల తనబృందంతో వెళ్ళారు. ఈ క్రమంలో 2వ రోజు మలేషియాలో పామాయిల్ పంట సాగుపై అక్కడ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో, అవలంబిస్తున్న పద్దతులపై అధ్యయనం చేస్తూ మంత్రితో పాటు ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు.

## జిల్లాలో కోటి 75 లక్షల చేప పిల్లల పెంపకం



కామేపల్లి, అక్టోబర్ 24 (ప్రభాతవార్త): ప్రభుత్వం మత్స్య శాఖ ఆధ్వర్యంలో 100శాతం సబ్సిడీపై మత్స్య సొసైటీలకు అందజేస్తున్న చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,ఖమ్మం మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివప్రసాద్, మత్స్య సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటేశ్వర్లు గురువారం కామేపల్లి మండలం పాత లింగాల పెద్ద చెరువులో లాంఛనంగా ప్రారంభించారు.చెరువులో చేప పిల్లలను విడుదల చేసి పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. 100శాతం సబ్సిడీపై నాణ్యమైన చేప పిల్లలను అందజేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో 876 చెరువులలో కోటి 75లక్షల చేప పిల్లల పెంపకాన్ని చేపడుతున్నట్లు వివరించారు.5రకాల చేప పిల్లలను ప్రభుత్వం సూచన మేరకు పెంచుతున్నట్లు వివరించారు.కామేపల్లి మండలంలో 4.53లక్షల చేప పిల్లలను 55చెరువులలో పెంచడం జరుగుతుందన్నారు.6 పెద్ద చెరువులలో 3.84లక్షల చేప పిల్లలను పెంచనున్నట్లు తెలిపారు. కామేపల్లి పెద్ద చెరువు, కెప్టెన్ బంజర మామిళ్ళ చెరువు, కొమ్మినేపల్లి చెరువులో చేప పిల్లల విడుదలను మత్స్య సొసైటీలు, కార్మికుల భాగస్వామ్యంతో ఏడి శివప్రసాద్ నిర్వహించారు.ఈ



కార్యక్రమంలో మత్స్య శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ సరిత, సిబ్బంది భానుప్రసాద్, లక్ష్మణ్, గింజల నర్సింహారెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, మాజీ ఎంపిటీసీలు రామ్‌రెడ్డి జగన్నాథ్‌రెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య,కామేపల్లి సొసైటీ ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు,పాతలింగాల మత్స్య సొసైటీ బాధ్యులు దొప్ప రమేష్, మధ్యాహ్నపు రమేష్, అంజయ్య, కిన్నెర రాఘవులు, జగన్నాథం, దుర్గారావు, మత్స్య సొసైటీలకు చెందిన అజ్మీర రాందాస్ నాయక్, కొర్ర రాములు,చిన్నా, అజ్మీర కృష్ణ,మేకల మల్లికార్జున్ పాల్గొన్నారు.

## భూములు కోల్పోయిన రైతులకు రూ.8లక్షల నష్టపరిహారం ఇవ్వాలి



అశ్వారావుపేట అర్బన్, అక్టోబర్ 24 (ప్రభాతవార్త): మండలంలోని వినాయకపురం-మల్లాయిగూడెం గ్రామాల మధ్య అంకమ్మచెరువుకు భూములు ఇచ్చి భూములు కోల్పోయిన రైతులకు రూ.8లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ కంటె కేశవగౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. భూములు కోల్పోయిన వారికి కేవలం రూ.1లక్ష ఇచ్చి చేతులు దులుపుకున్నారని వారికి ఎకరానికి రూ.8లక్షలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

## జాస్తిపల్లిలో ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం

కామేపల్లి, అక్టోబర్ 24 (ప్రభాతవార్త): జాస్తిపల్లి గ్రామ పంచాయితీలో ఉప్పతల వెంకన్న బోదు వద్ద ఎన్‌జీటీ పనిని ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులుగురువారం సందర్శించారు.ఈ సందర్భంగా పని వలన ఉపయోగం, మస్టర్ విధానం, డిమాండ్, పని వద్ద కల్పిస్తున్న వసతి సౌకర్యాలను వారు అడిగి తెలుసుకున్నారు.అనంతరం జగన్నాథతండా గ్రామ పంచాయితీలో నర్సరీని సందర్శించారు.ఇన్సిట్యూషనల్‌ప్లాంటేషన్ విజిట్ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధిఅధికారి జి.రవీందర్, ఎంపీవో పి.ప్రభాకర్‌రెడ్డి, ఏపీవో అద్దంకి శ్రీరాణి, పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ బి.సతీష్, పంచాయితీ కార్యదర్శులు దేవి,విజయ, క్షేత్ర సహాయకులు బత్తుల రాంబాబు, కృష్ణ, సీనియర్ మేట్ రాయల వీరన్న, మాజీ ఉపసర్పంచ్ బత్తుల పుల్లయ్య, గ్రామస్తులు, కూలీలు రాయల అయోధ్య, రాయల రాములు, శంకర్, శ్రీనివాస రావు,ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపురం చెరువులో చేప పిల్లల విడుదల



అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 24 (ప్రభాతవార్త): మండల పరిధిలోని నారాయణపురం ఊర చెరువులో ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఏర్పాటు చేసిన చేప పిల్లలను వదలడం జరిగింది. పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి ఆధ్వర్యంలో ఊర చెరువులో పలు రకాలకు చెందిన 6వేల చేప పిల్లలను వదిలారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరిటాల సందీప్ కుమార్, పెద్దపూడి సత్యవతి తదితరులు ఉన్నారు.




**కారేపల్లి, వైరా, కొణిజర్ల, ఏన్కూరు**

# పాఠశాల అభివృద్ధి ప్రధాన లక్ష్యం

## వనరులతోనే ఆహ్లాదకరమైన వాతావరణం పలువురి ప్రశంసలు అందుకుంటున్న హెచ్ఎం నామ





**కారేపల్లి,అక్టోబర్ 24, ప్రభాతవార్త :**

విధుల నిర్వహణలోబాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ తాను ఏ పాఠశాలలో పనిచేసిన విద్యారుర్థుల ప్రయోజనాలు పరిసరాల శుభ్రత పాఠశాల అభివృద్ది లక్ష్యంగా తాను ఎంచుకున్న విధానానికి అనుగుణంగా నిచేయడమే ప్రధాన ఏజజెండ గతంలో ఐటీడీఏ పీవోగా పనిచేసిన గౌతం పోటు ప్రశంసలు అందుకున్న ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నామా నాయక్, సింగరేణి మండలంలో శాంతినగర్ ఆశ్రమ




పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో పలువురు ఐటీడీఏ అధికారుల మన్ననలను చూరగొన్న ప్రధానోపాధ్యాయులు నామ నాయక్ ప్రస్తుతం చెన్నం గలగడ్డ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలో విధులు చేపట్టే నాటికి అక్కడున్న పరిస్దితులు అంతంత మాత్రమే వాటిలో మార్పు తీసుకురావాలని ప్రధాన లక్ష్యంగా కృషి చేసిన ఫలితమే నేడు ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశీలిస్తే స్పష్టంగా అర్దమవుతుంది. తాను పనిచేసే పాఠశాలలో విద్యార్ధులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్ధుల ద్వారా ఉత్తమ ఫలితాలు రాబట్టడమే లక్ష్యంగా పనిచేయడం అలవాటుగా మారింది. దీని కనుగుణంగా చిన్నంగలగడ్డ ఆశ్రమ పాఠశాలలో పాఠశాల ఆవరణ యందు ఎత్తు పల్లాలు చెత్తాచెదారం లోతైన గుంటలు పూడ్చి వేయడంతో పాటు ఉన్న వనరులను వినియోగించుకొని పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా కార్యాచరణ చేపట్టారు. దీంతో పాఠశాల పరిసరాల రూపురేఖలు మారిపోయాయి. గతంలో కోతుల బెడదతో తీవ్రంగా ఇబ్బందులు పడే విద్యార్ధులు కొంత ఉపశమనం కలిగింది. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా పాఠశాల అభివృద్ది కొరకు తనతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో పాఠశాల ఆవరణలో చెట్ల కింద విద్యార్ధులు కూర్చోవడానికి గద్దెలు ఏర్పాటు చేశారు. విద్యార్ధులలో పరిసరాల పంరిరక్షణపై అవగాహన కల్పించేందుకు నిర్మాణం పూర్తి అయిన గద్దెల చుట్టూ రాయించిన నినాదాలు ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రం సమయంలో విద్యార్ధులు చెట్ల కింద కూర్చొని చదువుకునేందుకు అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమానికి తమ వంతు సహకారంగా టి వవీరంజి, ఫిజికల్ డైరెక్టర్ గురువారం పాఠశాల హెచ్ఎం నామా నాయక్ రూ. 20,016లు చెక్కును అందజేశారు. అదే విధంగా పాత బిల్లింగన శిథిలాలు, చెత్తచెదారం తొలగించడం గుంతలను పూడ్చుట మొక్కలు నాటుటకు పాఠశాల ఉపాధ్యాయులు బి నాగరాజు, జయపాల్ సాంబశివరావు, టి వెంకటేశ్వర్లు, శారత, జె విద్యారాణి, ఎం సుమతి, వై బాయమ్మ, ఈ వీరబాబు, ఎంఎల్ఎన్ మూర్తి, ఎం చంద్రయ్య, తమ వంతు ఆర్దిక సహాయం అందజేశారు. ఉపాధ్యాయ సిబ్బంది సహకారం పట్ల హెచ్ఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.... విద్యార్ధులకు నాణ్యమైన విద్యనఉ అందించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా పాఠశాల పరిసరాలు రూపురేఖలు మార్చడానికి తనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అందిస్తున్న సహకారం మరువలేనిది అన్నారు.

## ఉత్తమ పంపు ఆపరేటర్లకు ప్రశంస పత్రాలు



**కారేపల్లి, అక్టోబర్ 24, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని అప్పాయిగూడెంలోని రైతు వేధికలో 4రోజులుగా నిర్వహించిన మంచినీటి సహాయకులు శిక్షణా శిబిరం గురువారంతో ముగిసిందది. ఈ సందర్భంగా మండల పరిధిలోని 41గ్రామ పంచాయితీలలో మంచినీటి సరఫరాలో ఉత్తమ సేవలు అందించిన పంపు ఆపరేటర్లకు జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్లుఎస్ జిల్లా ఈఈ వాణిశ్రీ, డీఈ నర్సింహారావు, ఎంపీడీవో సురేందర్, సూపరేంట్ రమేష్, ఏఈలు నరేంద్రరావు, గ్రిడ్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, పంపు ఆపరేటర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలకు వేలం



**కారేపల్లి, అక్టోబర్ 24,, ప్రభాతవార్త :**

గుడుంబా స్దావరాలపై పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేసి గుడుంబా స్దావరాలపై విజిలెన్స్ దాడులను సైతం ముమ్మరం చేశామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ వి వేణుగోపాలరావు గురువారం పేర్కొన్నారు. కారేపల్లి క్రాస్ రోడ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఇటీవల స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలకు వేలంను ఎక్సైజ్ సీఐ ప్రశాంతి, ఎస్సై వసంతలక్ష్మిల ఆధ్వర్యంలోనిర్వహించారు. హీరో గ్లామర్, హోండా షైన్ ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించగా (ఖాజావలి, జానీమియా, వినాయక్) వేలం దారఉలు హోండా షైన్ వాహనానికి తీవ్రంగా పోటీ ఏర్పడింది. వినాయక్ రూ. 42వవేలకు హోండా షైన్ బండిని దక్కించుకోగా, హీరో గ్లామర్ వాహనానికి ఎవ్వరు ఆసక్తి చూపలేదు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరిండెంట్ మాట్లాడుతూ.... గ్రామాల్లో గుడుంబా స్దావరాలపై ప్రత్యేక నిఘాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అన్నారు. తమ సిబ్బందికి ఎటువంటి అనుమానం వచ్చిన తక్షణమే సోదాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ విజయ,మదర్, చాంద్‌పాషా, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## 28న కామేపల్లిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

**కామేపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:**

కామేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న ఉదయం 10గంటలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ,సామాజిక తనిఖీ ప్రజావేదికను మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రవీందర్ గురువారం తెలిపారు.ఏప్రిల్ 1, 2023 నుండి మార్చి 31 2024వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం ఈ నెల 14 నుండి 27వ తేదీ వరకు నిర్వహించిన తుది నివేదికను ప్రజావేదికలో సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు,ఉపాధి హామీ కూలీలు ఈ ప్రజా వేదికలో పాల్గొనాలని ఆయన కోరారు.

## అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వండి

## వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు వర్కింగ్ ప్రెసిడెంట్ దండు



**సత్తుపల్లి, అక్టోబర్ 24, ప్రభాతవార్త:**

అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఖమ్మం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో పాలకుర్తి వీరయ్య అధ్యక్షతన గురువారం బికెఎంయు జనరల్ బాడి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖమ్మం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు ఖమ్మంజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని వేల సంఖ్యలో ఇవ్వాల్సిన ఇళ్లను అక్కడక్కడా పదుల సంఖ్యలో ఇచ్చి నిరుపేద ప్రజలకు మొండి చేయి చూపించి మోసం చేసిందని మండి పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి ఇవ్వాలని కోరారు. అదే విధంగా భూములు లేనటువంటి పేదలకు రూ. 12 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. ఎన్టీఆర్ నగర్ కాలనీ, వెంగళరావునగర్‌కాలనీలో సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ కారణంగా నష్టపోయినటువంటి ఇళ్ల స్థానే కొత్త ఇళ్లు నిర్మించి ఇచ్చే విధంగా సింగరేణి యాజమాన్యంను ఒప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు సుత్తపల్లి మండల కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, మహిళా సమాఖ్య డివిజన్ అధ్యక్షురాలు ఎస్‌కె. రంజాన్‌బి, యువజన సమాఖ్య నాయకులు ఎస్‌కె. హమీద్, బి. అజయ్, ఆయేష, రమేష్, పర్సా శ్రీను, సత్యవతి, తహేర, నాగమణి, మహేశ్వరి, చెన్నమ్మ, రాంబాబు, సత్యనారాయణ, లక్ష్మీ, రాము, రమణ, వెంకటేశ్వరరావు, సతీష్, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట

**కామేపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలంలో విద్యుత్ శాఖ అధికారులు గురువారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.కొత్తలింగాల సెక్షన్‌లోని పొన్నెకల్ గ్రామంలో పొలం బాటలో భాగంగా వ్యవసాయ మోటార్ల కు కెపాస్టరును బిగించడం వలన కలిగే లాభాలు, మోటార్లపై పడే ఓల్టేజీ హెచ్చు తగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడే ఓవర్ లోడ్‌తో పాటు విద్యుత్ భద్రతపై పలు సూచనలు రైతులకు చేసి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కొత్త లింగాల ఏఈ ఎన్.శ్రీనివాసులు, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాధతండాలో మొక్కలు నాటిన కేంద్ర అధికారుల బృందం

**కామేపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:**



జగన్నాథ్‌తండా గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణంలో ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు గురువారం మొక్కలు నాటారు.క్షేత్రస్థాయి అధ్యయన కార్యక్రమానికి విచ్చేసిన అధికారులు నర్సరీలో పెంచిన మొక్కలను నాటి వాటికి నీళ్ళు పోసి రక్షణ కవచాలను ఏర్పాటు చేశారు.ఈజీఎస్ ఏపీవో అద్దంకి శ్రీరాణి ఆధ్వర్యంలో ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు మనీషా మీనా ఐఏఎస్, సులేఖ జగర్వార్ ఐపీఎస్, నీలేష్, శ్రీకాంత్ గైక్వాడ్,అరు సెల్వన్, మది వదని పచ్చదనం పెంపుదల, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, మారుమూల ఏజేన్సీ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకై వారు మొక్కలు నాటారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ ఆధ్వర్యంలో నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నెల్లూరి చందన, సీహెచ్ఓ సుధారాణి, హెచ్ఈవో వెంకటేశ్వర్లు, ముచ్చర్ల పశువైద్యులు డాక్టర్ గోపి కృష్ణ,ఎంఈవో,ఉపాధ్యాయులు, పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ బి.సతీష్, పంచాయితీ కార్యదర్శి విజయ, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ, మిషన్ భగీరథ గ్రిడ్ సూపర్‌వైజర్ చిలుముల రమేష్, ఫిట్టర్ చల్ల లక్ష్మయ్య, లైన్‌మెన్‌లు బత్తుల మల్లయ్య, శీలం ఉపేందర్, సెర్ప్ సీసీలు కటికోల వీరభద్రం, పెరుగు మల్లయ్య, నలగాటి వీరయ్య, ఇనపనూరి ప్రసాద్, మల్టీపర్పస్ వర్కర్లు, మిషన్ భగీరథ ఇంట్రా సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూర్

# సత్తుపల్లిలో అయ్యప్ప స్వాముల సందడి

## ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన స్వాములు అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించిన సిఐ దంపతులు

*సత్తుపల్లి, అక్టోబర్ 24,(ప్రభాతవార్త):* సత్తుపల్లి పట్టణంలో అయ్యప్ప స్వాముల దీక్షలు తీసుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంతో గురువారం నుండి అయ్యప్ప స్వాములు భజనలు, సందడి ప్రారంభమైంది. 45 రోజుల పాటు స్వాములు ఈ అయ్యప్ప స్వామి మాలాధారణ స్వాములు నిత్యం ప్రత్యేక పూజలు చేసుకుంటూ ఇరుముడులతో శబరిమల యాత్రకు వెళ్లి వారి వారిత మొక్కులు చెల్లించుకుంటుంటారు. సత్తుపల్లి పట్టణ శివారులోని వేంసేసి యున్న శ్రీ హరిహరాత్మజ అయ్యప్ప స్వామివారి దేవాలయంలో గురువారం సత్తుపల్లి పట్టణంతో పాటు కిష్టారం, రేజర్ల, గంగారం, కాకర్లపల్లి పక్కమండలం అయిన దమ్మపేట మండలంలోని పలు గ్రామాల నుండి అయ్యప్ప స్వాములు దాదాపు 450 మంది



స్వాములు దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి అయ్యప్ప స్వామి భజన పాటలతో ఆలయంలో సందడి చేశారు. 50 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు ఉచిత అన్న ప్రసాద కార్యక్రమాన్ని (భిక్ష) ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, సత్తుపల్లి సీఐ టి. కిరణ్ కుమార్ ఆయన సతీమణి గీతలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిఐ దంపతులు అయ్యప్ప స్వాములకు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని (భిక్ష)ను ప్రారంభించడం జరిగింది. తొలిరోజున 450 మంది స్వాములకు మరిడి చంద్రమోహన్ ఆయన సతీమణి కుటుంబ సభ్యులు ఏర్పాటు



చేసిన ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభల ఆధ్వర్యంలో సీఐ టి. కిరణ్ గీతా దంపతులు స్వాములకు స్వయంగా వడ్డించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు అధ్యక్షులు దోసపాటి అమర లింగేశ్వరరావు, కార్యదర్శి బచ్చు శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు ద్రోణం రాజు, మల్లిఖార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, రావి నాగేశ్వరరావు, బీముశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల సోమేశ్వరరావు, పొలిశెట్టి శివ కుమార్, దురిసేటి శ్రీనివాసరావు, నాగుబండి బాస్కర్‌రావు, తదితరులు పాల్గొనగా భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు మూలాధారులకు వడ్డన చేశారు.

## వ్యాపారస్తులు లైసెన్స్‌లు తీసుకోవాలి

*సత్తుపల్లి, అక్టోబర్ 24,(ప్రభాతవార్త):* సత్తుపల్లి పట్టణంలో వ్యాపారాలు నిర్వహిస్తున్నటువంటి వ్యాపారస్తులంతా రాష్ట్ర అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాదువారి ఆదేశాల మేరకు అందరూ ఆన్‌లైన్ ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం. రవి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను పట్టణంలో వ్యాపారాలు నిర్వహిస్తున్ననటువంటి దుకాణాల వద్దకు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మీ షాపు వద్దకు వచ్చి వాటికి కావాల్సిన పాన్ కార్డు, ఆధార్ కార్డు, లీజ్ అగ్రిమెంట్, ఇంటి పన్ను కట్టిన రసీదులు, అందింది సిబ్బందికి సహకరించాలని కమిషనర్ రవి బాబు కోరుతున్నారు. వ్యాపారస్తులు అందరూ సహకరించి ఆన్‌లైన్ ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని, లేని యెడల తెలంగాణ మున్సిపల్ యాక్టు 2018 చట్టం ప్రకారం మీ షాపును సీజ్ చేసి చర్యలు తీసుకోబడుతాయని కమిషనర్ హెచ్చరించారు.

## హమాలీలకు కూలీ రేట్లు పెంచండి




*సత్తుపల్లి, అక్టోబర్ 24,(ప్రభాతవార్త):* పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచి హమాలీల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఎ.వెంకన్న, ఆ సంఘం నాయకులు అమర్లపూడి శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో గురువారం నీలం రామచంద్రయ్య భవన్‌లో వై. సత్తి బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని పై విధంగా అన్నారు. హమాలీ కార్మికులు ఎండనకా, వాననకా నిరంతరం కష్టపడి పని చేస్తున్నారని, వారి శ్రమకు తగిన ఫలితం దక్కడంలేదని, అకస్మాత్తుగా ప్రమాదాల్లో చనిపోయినా ప్రభుత్వం వారికి నష్టపరిహారం చెల్లించడం లేదని వెంకన్న,శరత్‌లు అన్నారు. ఈ రోజు రాష్ట్రంలో నిత్యవసర సరుకులు ఆకాశాన్నంటుతున్నాయని, హమాలీల కూలీ రేట్ల విషయంలో పెరుగుదల లేదని తద్వారా అర్ధాకలితో అలమటిస్తున్నారని వారు అన్నా రు. ప్రభుత్వం కూలీ రేట్లు పెంచి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి హమాలీ కార్మికులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్ శ్రీనివాస్, బి. వెంకన్న, సాంబయ్య, ధరావత్ వెంకటేశ్వరరావు, మారేశ్వర రావు, సీహెచ్. రాధాకృష్ణ, ఆర్. సత్యనారాయణ, చింతం కృష్ణ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



*తల్లాడ, అక్టోబర్ 24, (ప్రభాతవార్త)* మండల పరిధిలోని అంజనాపురం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఎంపిటిసి కొమ్మినేని ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ కొమ్మినేని విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా మేడిశెట్టి నాగేశ్వరరావు, చందా బాబు, పోతుమర్తి నాగేశ్వరరావులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బందారుపల్లి రామారావు, కేతినేని చలమయ్య, పులి కృష్ణయ్య, కొమ్మినేని శ్రీనివాసరావు, బందారుపల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఎన్నిక



*పెనుబల్లి, అక్టోబర్ 24, (ప్రభాతవార్త)* పెనుబల్లి శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులుగా బొర్రా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా మిద్దే స్వామి, కోశాధికారిగా అన్నపరెడ్డి లక్ష్మయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ముత్యాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో జరిగిన సమావేశంలో అభివృద్ధి నిర్వహణ కోసం గ్రామస్థులు కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా బొర్రా కనకారావు, పంతంగి వెంకటేశ్వర్లు, చిలకబత్తుల చెన్నారావు, మల్లెల శ్రీనివాసరావు, బండి వెంకటేశ్వర్లు, బొర్రా నరసింహారావు, గోదా శ్రీనివాసరావు, చీపి వెంకటేశ్వర్లు, కంటే సాయి, చలమాల రాజ్‌కుమార్, ఎనికె ప్రసాద్, వేముల రవికుమార్, చీపి పెద్ద వెంకటేశ్వర్లు, వేముల బాబూరావు, మారిని వెంకటేశ్వరరావు, నాయుడు గోవర్ధన్, ఆచంటి శ్రీనివాసరావు, మిట్టపల్లి కిరణ్‌కుమార్, మద్దెల రమేష్, సింగిశాల వెంకటేశ్వరరావు, పెద్దగౌడ్ వంగా కృష్ణ, వంగా చెన్నారావు, వంగా సత్యనారాయణ, వంగా అశోక్, గుంజా శ్రీనివాసరావు, తేజవత్ బిక్కు, తేజావత్ తావు, తేజావత్ సుక్కు, షేక్ అబ్దుల్‌తో కూడిన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొర్రా కోటేశ్వరరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, వెలివల పుల్లయ్య, పొట్లపల్లి కృష్ణ, వంగా రాములు, చలమాల విఠల్‌రావు, మల్లెల రాజా తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం మండల మహాసభను జయప్రదం చేయండి



*తల్లాడ, అక్టోబర్ 24, (ప్రభాతవార్త)* ఈ నెల 26వ తేదీన మండల పరిధిలోని అన్నారుగూడెంలో జరుగు సిపిఎం మండల మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు మాచర్ల భారతి, మాదినేని రమేష్‌లు కోరారు. గురువారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తానన్న ఆరు పథకాలను వెంటనే అమలుచేయాలని, రైతులకు, నిరుద్యోగులకు అమలుచేస్తానన్న పథకాలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, శీలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్, ఎస్‌కె. మస్తాన్, చల్లా నాగేశ్వరరావు, ముచ్చింతల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుడిపల్లి భాస్కరరావుకు పలువురు నివాళులు

*తల్లాడ, అక్టోబర్ 24, (ప్రభాతవార్త)*



రజక సంఘం నాయకుడు గుడిపల్లి భాస్కరరావు కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో భాస్కరరావు మృతిచెందగా గురువారం దశదిన కర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి రజక సంఘం జిల్లా అధ్యక్షులు తమ్మారపు బ్రహ్మయ్య, నిమ్మటూరి రామకృష్ణ, గుడిపల్లి వెంకటేశ్వర్లు, జర్నలిస్టులు ఎండి. బహదూర్, జి. నారాయణ తదితరులు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కరరావు కుమారుడు కృష్ణారావును పలువురు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్, భుక్య అంజయ్య తదితరులు ఉన్నారు.

## ఎరువుల నిల్వల తనిఖీలు

*పెనుబల్లి, అక్టోబర్ 24, (ప్రభాతవార్త)* మండలంలోని వివిధ ఎరువులు, పురుగు మందుల షాపులలో



ఎరువుల నిల్వలు ఫెర్టిలైజర్ ఇన్వెస్టరీ వెరిఫికేషన్ సిస్టమ్ ఆప్‌లో నమోదు చేయడానికి జిల్లా వ్యవసాయ అధికారి ధనసిరి పుల్లయ్య, సత్తుపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు గురువారం తనిఖీలు నిర్వహించారు. అలాగే డిజిటల్ క్రాప్ సర్వే ఆప్‌లో పంట నమోదు కార్యక్రమాను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులున్నారు.

# స్కేటింగ్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పనున్న తెలంగాణ చిన్నారులు..

## నాన్‌స్టాప్‌గా 300కి.మీ. బ్యాక్‌వార్డ్ స్కేటింగ్ స్కేటింగ్ గురువు ప్రతాప్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రామోజీ ఫిల్మ్ సిటీనుంచి, భద్రాచలం వరకు ఈవెంట్..



*కూసుమంచి, (ప్రభాతవార్త) :*

స్కేటింగ్‌లో తెలంగాణరాష్ట్రంలో అరుదైన ప్రపంచ రికార్డు నమోదు కాబోతుంది. పూర్తి వివరాలలోకి వెళితే..హైదరాబాద్ నగరానికి చెందిన నవీన్‌కుమార్, అశ్వినిల కుమారులు కే రాజేష్‌కుమార్ (13), ఉమేష్‌కుమార్ (12) బ్యాక్‌వార్డ్ స్కేటింగ్‌లో ప్రపంచ రికార్డే ధ్యేయంగా, నాన్‌స్టాప్ మల్టీ టాస్కింగ్ ఈవెంట్ 300కి,మీ.టాస్క్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం కూసుమంచి మండలం గంగబండతండ వద్ద హైవేపై స్కేటింగ్ చేస్తూ వెళుతున్న వారిని వివరాలు అడగగా వివరాలు తెలిపారు. గురువారం ఉదయం 6గంటలకు టాస్క్ మొదలైందని, ఈ వరల్డ్ రికార్డు నమోదులో వరల్డ్ రికార్డు అధికారులతో పాటు మొత్తం ఆరు ప్రపంచ రాకార్డుల అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ చిన్నారి అన్నదమ్ముల సాహసానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించడం జరిగిందని వారు తెలిపారు. ఈ ఈవెంట్‌కు సహకరించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావుకు, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డికి, పోలీస్ ఉన్నతాధికారులకు చిన్నారుల తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారు.

# బిజేపి శ్రేణులు సైనికుల్లాగా పని చేయాలి

*నేలకొండపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:*

బిజేపి పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లాగా పని చేయాలని బిజేపి సభ్యత్వ నమోదు జిల్లా ఇంచార్జ్ బైరెడ్డి ప్రభాకరరెడ్డి పిలుపు నిచ్చారు. బిజేపి పార్టీ సభ్యత్వ నమోదు విస్తృతంగా చేపట్టాలని ఆయన చెప్పారు. ఈ నెల 29వ తేదీ లోపుగా బిజేపి సభ్యత్వ నమోదు టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆయన చెప్పారు. గురువారం నేలకొండపల్లి నందు మండల బిజేపి పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిద బూత్



స్థాయిలో బిజేపి సభ్యత్వ నమోదు పై ఆయన సమీక్షి ంచారు. ఈ సమావేశంలో బిజేపి పాలేరు నియోజకవర్గం కన్వీనర్ మేకా సంతోష్‌రెడ్డి, బిజేపి జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నె కృష్ణారావు, నేలకొండపల్లి మండల బిజేపి అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, బిజేపి మైనార్టీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్.షరీఫుద్దీన్, మండల బిజేపి నాయకులు పిట్టల సూరిబాబు, గెల్లా చక్రపాణి, ఎలిగేటి నర్సి ంహారావు, బాజా రామకృష్ణ, ధారవత్ వీరునాయక్, కందరబోయిన గోపి, ఆర్.నాగరాజు, పురాణం దివాకర్, గెల్లా సాయికుమార్, కొండ హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యం

## -విద్యాశాఖ జేడి రాజేందర్‌సింగ్

*నేలకొండపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:*

విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధిని కల్పించడమే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు విద్యాశాఖ జేడి రాజేందర్‌సింగ్ వెల్లడించారు. గురువారం నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువు, సామర్థ్యం పరీక్షించి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేడి రాజేందర్‌సింగ్



మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీలలో సీట్లు నిండిన తర్వాతనే విద్యార్థులు ప్రయివేట్ కాలేజీలకు వెళ్తున్నారని ఆయన చెప్పారు. రూ.14కోట్ల నిధులతో ఇక్కడ మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు హాస్టల్ భవనాలు నిర్మించినట్లు ఆయన చెప్పారు. ఆతర్వాత కళాశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం స్థానిక భక్తరామదాసు ధ్యాన మందిరంను ఆయన సందర్శించి పూజలు చేసారు. భక్తరామదాసు ధ్యాన మందిరం విశిష్టతను ఆయన ఆమందిరం అర్చకుడు సామి త్రి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గవర్నర్‌కు స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీలు





*కొత్తగూడెం, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం సారపాక ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్‌లు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

## శౌరిని పరామర్శించిన పొదెం

*కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*



టీపీసీసీ మెంబర్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరికి ఇటీవల గుండెపోటుకు గురి కావడంతో ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స తీసుకొని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న శౌరిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఫారెస్టు డెవలప్‌మెంట్ చైర్మన్ పొదెం వీరయ్య పరామర్శించారు.

## మండల సిపిఎం కార్యదర్శిగా రెండవసారి కేవి రామిరెడ్డి ఎన్నిక

*నేలకొండపల్లి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:*



నేలకొండపల్లి మండల సిపిఎం కార్యదర్శిగా రెండవసారి కేవి రామిరెడ్డి ఎన్నికైనారు. గురువారం మూటాపురం గ్రామం నందు మండల సిపిఎం 9వ మహసభ జరిగింది. ఈ సభలో గత మూడేళ్ళ కాలంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, ప్రజా ఆంధోళనలు సమీక్షించుకున్నారు. అలాగే, రాభోయే మూడేళ్ళ కాలంకు సంభందించి 23మందితో మండల సిపిఎం పార్టీ నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ కమిటిలో సభ్యులుగా గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చ నర్సి ంహరావు, బెల్లం లక్ష్మి, బలుసు ప్రమీాల, మందడపు మురళీకృష్ణ, కట్టెకోల వెంకటేశ్వర్లు, పగిడికత్తుల నాగేశ్వరరావు, ఎడ్ల తిరుపతిరావు, రాసాల నవీన్, డేగల వెంకటేశ్వరరావు, పెద్దిరాజు నరసయ్య, కూరపాటి ప్రసాదు, మార్తి కొండలరావు, రాసాల కనకయ్య, శీలం అప్పారావు, యరదేశి నర్సి ంహరావు, గుగులోత్ వీరు, ఇంటూరి అశోక్, దండా సూర్యనారానాయణ, బొడ్డు మధు, దుగ్గి నర్సి ంహరావు, మహిళ కోఆప్షన్ మెంబర్‌లను ఎన్నుకున్నారు. అలాగే, గత అనేక సంవత్సరాలుగా సిపిఎం పార్టీకి సేవలు అందించి మండల కమిటి నుంచి రిలీవ్ అయిన సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఏటుకూరి రామారావు, పొన్నం శివరాజులను మండల సిపిఎం పార్టీ కమిటి నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.




**నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం**

## రామనాథం మృతిపట్ల సీపీఐ నాయకుల నివాళి



*కూసుమంచి, అక్టోబర్ 24 (ప్రభాతవార్త) :*

తుడుం రామనాథం కుటుంబానికి అండగా ఉంటామని సీపీఐ నాయకుడు పోటు ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని నేలపట్ల గ్రామానికి చెందిన సీపీఐ మండల మాజీ సహాయ కార్యదర్శి, ప్రస్తుత గ్రామ శాఖ కార్యదర్శి తుడుం రామనాథం గురువారం తెల్లవారుజామున అనారోగ్య సమస్యతో మృతి చెందారు. స్థానిక నాయకుల నుంచి విషయం తెలుసుకున్న జిల్లా పార్టీ నాయకులు జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ రామనాథం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ రామనాథం గ్రామంలో పార్టీ ఎన్ని ఒడుదుడుకులు ఎదుర్కొన్నా నిలబడి పార్టీ బలోపేతానికి పనిచేశారని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి భూక్యా నరసింహా, జిల్లా సమితి బాధ్యులు గుండెపొంగు మల్లేష్, నాయకులు నంబూరి నారాయణ, మర్రి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక




*కూసుమంచి, అక్టోబర్ 24 (ప్రభాతవార్త) :*

ఎస్ఎఫ్ఐ కూసుమంచి మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండలకేంద్రంలోని జేవీఆర్ జూనియర్ కళాశాలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలోకి జూనియర్ కళాశాల కార్యదర్శి రాము, అధ్యక్షునిగా బబ్లూతో పాటు 21మంది సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీలో ఇందు, అఖిల, సాదిత్, మధు, జైరాం తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపట్ల అనేక పోరాటాలు నిర్వహించిన ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. సమస్యల పరిష్కారానికి భగత్‌సింగ్, చేగువేరా, అంబేద్కర్ స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శీలం ఉమేష్, బోడ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా న్యాయవాది - ఛలో ఖమ్మం

*కొత్తగూడెం లీగల్, అక్టోబర్ 24 - ప్రభాతవార్త:*

ఐలూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 2024 అక్టోబర్ 26,27 తేదీల్లో శని, ఆదివారాల్లో ఖమ్మం బైపాస్ రోడ్‌లోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో మహిళా న్యాయవాదుల తృతీయ రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుంది. ఉదయం 10.30 గంటలకు ఐలూ మహిళా విభాగం కన్వీనర్ చందాల శైలజ అధ్యక్షతన జరిగే ప్రారంభ సభలో నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ జయశ్రీ ప్రారంభ ఉపన్యాసం చేస్తారని, తెలంగాణ గౌరవ అధ్యక్షుడు విద్యాసాగర్, కొల్లి సత్యనారాయణ, ఎన్. శ్రీనివాసరావులు పాల్గొంటారని చెప్పారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఐలూ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ మక్కడ్ తెలిపారు.

# రిజిస్టర్‌లలో ఓసియల్...జేబుల్లో ఫుల్ జీతం...

**- డిఈఓ ప్రొసీడింగ్ లేకుండానే ఓసిఎల్ జీతం డ్రా**
**- చుట్టపు చూపుకు పరిమితమైన విద్యాశాఖ అధికారులు...**
**- చోద్యం చూస్తున్న జిల్లా ఉన్నతాధికారులు**
**- జానకీపురం హైస్కూల్లో బట్ట బయలైన ఓ హెచ్ఎం బాగోతం...**

*మధిర అక్టోబర్ 24, ప్రభాతవార్త :*

ఆయనొక నియంత...ఆయన మాటే వేదం...ఆయన ఏది చేసిన చెల్లుబాటు అవుతుందను అనుకున్నాడేమో తెలియదు గాని ఏకంగా రిజిస్టర్లలో ఓసియల్‌ను జిల్లా విద్యాశాఖఅధికారి నుంచి ప్రొసీడింగ్ లేకుండానే ఫుల్ జీతం తీసుకుంటూపోతున్నాడు.... అలా ఒక నెల కాదు రెండు నెలలు కాదు కొన్ని నెలలు నుంచి ఇదే తంతు కొనసాగుతున్నది... అంతేకాకుండా సెలవులను సైతం హాజరులుగా మార్చుకుంటూ, స్కూలుకు వచ్చేది నాలుగు రోజులు అయినా నెల మొత్తం వచ్చినట్టు హాజర్లు వేసుకొని ఏకంగా నెలల తరబడి జీతం మొత్తం జేబులో వేసుకుంటున్న ఓ ప్రధానోపాధ్యాయుడు బాగోతం పై ప్రభాతవార్త కథనం....

వివరాల్లోకి వెళితే నియెజకవర్గంలోని బోనకల్లు మండలం జానకీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలె విధులు నిర్వహిస్తున్న ఓ ప్రధానోపాధ్యాయుడు తన ఒంటెద్దు విధానాలతో నిర్వహిస్తున్న వ్యవహారం పట్టించుకునేవాడు లేకపోవడంతో దినదిన ప్రవర్తమానమై తారాస్థాయికి చేరింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నటువంటి శ్రీనివాస్‌కుమార్ నెలలో పట్టుమని నాలుగు రోజులు స్కూలుకు వచ్చే పరిస్థితి లేదని, అలా నాలుగు రోజులు రావడమే కాకుండా ఏకంగా నెల మొత్తం హాజరైనట్లు రిజిస్టర్లో సంతకాలు చేసుకొని జీతాలు తీసుకుంటున్న దుస్థితి నెలకొందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. అంతేకాకుండా జీతం తీసుకునే అవకాశం తన చేతిలోనే ఉంది కాబట్టి హాజరు రిజిస్టర్లో ఓసిఎల్ అని పెట్టి తర్వాత డీఈవో ప్రొసీడింగ్స్ లేకుండానే ఫుల్‌జీతం తీసుకుంటున్న తీరు ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతుండడం ఇక్కడ గమనించాల్సిన అంశం. వాస్తవానికి ఓసిఎల్ పెట్టిన తర్వాత జీతం తీసుకోవాలంటే జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ప్రొసీడింగ్ తీసుకోవాలని అలా ప్రొసీడింగ్ తీసుకున్న తర్వాతనే ఓసిఎల్ జీతం తీసుకోవాలని కానీ దీనికి విరుద్ధంగా ఎటువంటి ప్రొసీడింగులు లేకుండానే బిల్లులు పూర్తి చేస్తూ జీతంతో జేబులు నింపుకుంటున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని మండల పరిధిలోని పలువురు సహచర హెచ్ఎంలు పేర్కొనడం గమనార్హం. ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగ బాధ్యతల్లో ఉన్న ఈయన చేస్తున్న నిర్వాకంపై ఇదేమిటని అడిగితే డిఈవో నా క్లాస్‌మేట్.. నేను ఏది చెప్తే అది చేస్తాడు అలాంటప్పుడు ఆయన ప్రొసీడింగ్ నాకేం అవసరం అంటూ అడిగిన వారిపై ఆగ్రహాలను వ్యక్తం చేసిన సందర్భాలు కూడా లేకపోలేదని వెల్లడించడం గమనార్హం. నేనను నాకు ఎదురేలేదు...బెదిరేది లేదు అనే తరహాలో ఇష్టా రీతిలో నిర్లక్ష్యపు ధోరణిలో విధులు నిర్వహిస్తూ కాసులకు కక్కుర్తిపడి ప్రభుత్వ సోమ్మును డ్రా చేసుకుంటున్న పరిస్థితి దాపురించిందని పలువురు మండిపడుతున్నారు. అంతే కాకుండా ఇక్కడ పనిచేసేటువంటి మధ్యాహ్న భోజన పథకం విషయంలో కూడా ప్రతిరోజు విద్యార్థులు ఎంత మంది వస్తే అంత మందికి మాత్రమే మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయాలి కానీ తక్కువ మంది విద్యార్థులు వచ్చినగాని ఎక్కువగా వచ్చినట్లు చూపించడం తద్వారా వచ్చే బిల్లులో జేబులో వేసుకుంటున్న దుస్థితి నెలకొందంటే ఈ ప్రధానోపాధ్యాయుడు కక్కుర్తి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో దీన్ని బట్టి చూస్తే అర్థమవుతుంది. దీనికి తోడు ఒక్కోక్క విద్యార్థి దగ్గర నుంచి అదనంగా అక్రమంగా వసూలు చేయటం స్కావెంజర్స్ డబ్బులు మటుమాయం చేయటం ఈయనకి పరిపాటిగా మారింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న జానకిపురం లో ఇంత జరుగుతున్న గాని ఇట్లాంటి అక్రమాలకు పాల్పడుతూ అందినకాడికి దోచుకుంటున్నాగాని జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉపాధ్యాయ వర్గాల్లో వెల్లువెత్తుతున్నాయి. తిలాపాపం తలాపిడికెడు అన్న రీతిలో కంచె చేను మేస్తున్న రీతిలో జరుగుతున్న ఈ వ్యవహారం విద్యాశాఖలో జరుగుతున్న లోపాలకు మచ్చుతునకగా మాత్రమేనని, ఇలాంటి సంఘటనలు ఎన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన స్పందన కరువైందని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పేర్కొనడం విద్యాశాఖ ముసుగులో జరుగుతున్న లోపాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని వెల్లడిస్తుంది. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇటువంటి అంశాలపై ఉన్నతాధికారులు చుట్టపు చూపు తనిఖీలు చేయడం, తన అనుకున్నవాడు ఏ తప్పు చేసినా గుట్టుచప్పుడుగా ముగించడం పరిపాటిగా మారిందని విద్యాశాఖ ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిపై చర్యలు తీసుకున్న పాపాన పోలేదని వారు అన్నారు. అవినీతి అక్రమాలు పై నిర్లక్ష్యపు ధోరణితో వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు తీరుపై అనేకమార్లు జిల్లా విద్యాశాఖ అధికారికి చెప్పిన గాని జిల్లా విద్యాశాఖ అధికారికి చెప్పిన గాని జిల్లా విద్యాశాఖ అధికారి ఒకటికి రెండుసార్లు వచ్చిన గాని అతని స్నేహితుడు కాబట్టే చూసి చూడనట్టుగా వదిలేస్తున్నాడని లేకపోతే ఎందుకు చర్యలు తీసుకోకుండా ఉంటాడని కొందరు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా విద్యా వ్యవస్థ వృత్తినీ అప్రతిష్టపాలు తీసుకొచ్చే విధంగా వ్యవహరిస్తున్న ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నత అధికారులు కొరడా ఝుళిపించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు రాజకీయ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు ముక్తకంఠంతో కోరుతున్నారు...





## కోయగూడెం ఓసీలో ఎల్ఎస్ఎన్ ఇష్టారాజ్యం

**సింగరేణి బోసస్ కొందరికే...**
**నెల ఆఖరిలో జీతం చెల్లింపుతో కార్మికుల కష్టాలు**
**పట్టించుకోని సింగరేణి అధికారులు**


*టేకులపల్లి, ప్రభాతవార్త, అక్టోబర్ 24:*

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఏరియా టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఉపరితగనిలోని ఓబీ టెండర్‌లో పనిచేస్తున్న ఎల్ఎస్ఎన్ కంపెనీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని ఉపరితలగనిలో విమర్శలు వినిపిస్తున్నాయి. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు వారి కష్టాలు చెప్పుకునే స్థితిలో లేరు. కనీస కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణీ బోనస్ చెల్లింపులో అంతర్యం ఎమిటని...కంపెనీ యాజమాన్యాన్ని ప్రశ్నించే దైర్యం ఏ కార్మికుడు కూడా చేయడం లేదని,ప్రశ్నిస్తే కార్మికుడిని డ్యూటీ ఆపడమే జరుగుతుందని,ప్రతి నెల జీతం నెలఖరులోనే చెల్లింపులు చేస్తున్నారని, కార్మికులపై సమస్యలపై ఎల్ఎస్ఎన్ కంపెనీ నిర్లక్ష్యంగా ఉందని ఆరోపణలు ఉన్నాయి. కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఉపరితగనిలో ఓబీ టెండర్‌లో పనిచేస్తున్న ఎల్ఎస్ఎన్ కంపెనీ కార్మికులకు కనీస కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.కార్మికులు తమ కష్టాలను పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఎస్ఎన్ కంపెనీలో 330 మంది పనిచేస్తున్న 163 మందికే సింగరేణి బోసస్ వచ్చినట్లు సమాచారం. వంద పనిరోజులు ఉన్న ప్రతి కార్మికుడికి సింగరేణి బోసస్ ఇవ్వాలని కార్మికులు పేర్కోంటున్నారు.. ఈఫీఎఫ్ తమ ఖాతా నుంచి కంపెనీ తీసుకోలేదు దీంతో బోసస్ పడలేదని కంపెనీ తెలుపుతుందని కార్మికులు చెబుతున్నారు. సింగరేణిలో సర్క్యులర్ ప్రకారం ఈఫీఎఫ్ తీసుకోకున్నా వంద పనిరోజులు ఉన్న ప్రతి కార్మికుడికు సింగరేణీ బోనస్ చెల్లింపు చేయాలని కార్మిక సంఘాలు పేర్కోంటున్నాయి. సింగరేణి అధికారులు ఈఫీఎఫ్ ఎందుకు తీసుకోలేదో తెలుసుకోవాల్సిన ఉన్న కార్మికులను పట్టించుకోవట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్ఎస్ఎన్ కంపెనీ సంవత్సరం పూర్తయిన సందర్భంగా 240 పనిరోజులు చేసిన ప్రతి కార్మికుడికి కంపెనీ బోసస్ చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కంపెనీలు పూల్ బోసస్ కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించిందని కార్మికులు తెలుపుతున్నారు. కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు నెల ఆఖరులో జీతాలు చెల్లిండంతో కష్టాలు పడుతున్నట్లు కార్మికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడవల్సి వస్తుందని అంటున్నారు. ఎల్ఎస్ఎన్ కంపెనీలో సౌకర్యలు లేవని,అన్ని రకాల చట్టాలను ఉల్లఘించిన అడిగేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ఎల్ఎస్ఎన్ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి**

టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఉపరితలగనిలోని ఓబీ కంపెనీ ఎల్ఎస్ఎన్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి కంపెనీ నియమనిబంధనలు పాటించట్లేదు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తునారు. కార్మికులను సింగరేణి బోసస్, సంవత్సర బోసస్ అందరికి చెల్లించాలి లేకుంటే ఆందోళనలు చెపడుతాం




## డైరీ లాభదాయకంగా నడిపేందుకు కృషిచేయాలి

**ప్రతి ఒక్కరికి లాభం చేకూరేలా పాల వ్యాపారం నిర్వహించాలి**
**ఇందిరా మహిళా డైరీని సందర్శించిన జిల్లా కలెక్టర్**

*ఎర్రుపాలెం, అక్టోబర్ 24, ప్రభాతవార్త:*

ఇందిరా మహిళా డైరీ డైరీ లాభసాటిగా నడిపేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. గురువారం ఎర్రుపాలెంలోని ఇందిరా మహిళా డైరీని కలెక్టర్ సందర్శించి మహిళా పాడి రైతులతో పాల వ్యాపారం, రోజువారీ పాల అమ్మకాలు, ఇందిరా మహిళా డైరీకి ఎన్ని గ్రామాల నుంచి ఎంతమంది పాడి రైతులు పాలు అందిస్తున్నారని, లీటర్ పాలకు ఎంత చెల్లిస్తున్నారని, పాలను ప్రాసెసింగ్ చేసే డైరీకి ఎంతకు అమ్ముతుందని తదితర వివరాలను మహిళా సంఘాల సభ్యులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ డైరీ నిర్వహణలో ప్రతి అంశాన్ని వ్యాపార దృష్టితో చూడాలని, మనకు మంచి లాభాలు వస్తేనే మన స్వయం సహాయక సంఘాలకు ఉపయోగపడుతుందన్నారు.మంచి కొవ్వు పాలు పోసే పాడి రైతులు ఎటువంటి జాగ్రత్తలు పాటిస్తున్నారని వివరాలను తెలుసుకొని మిగిలిన పాడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సంఘ సభ్యులకు ఆదాయం ఎలా పెంచాలని అనే ఆలోచనతో మనమంతా పనిచేయాలన్నారు. పాలలో ఒక కొవ్వుశాతం పెరిగితే రూ.8ధర పెరుగుతుందని ఈ అంశాన్ని పాడి రైతులు దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. స్వయం మహిళా సంఘం పరిధిలోని పాడి రైతులకు వచ్చేవారం పాలవ్యాపారం, కొవ్వు శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పాల సేకరణ కోసం మొత్తం ఐదు కేంద్రాలను ఏర్పాటుచేశామని, డైరీ నిర్వహణ వ్యాపారాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలన్నారు. విజయవంతంగా వ్యాపారం చేస్తున్న మహిళా సంఘాల అనుభవాలను తెలియజేయాలని, సాంకేతిక అంశాలతో కూడిన శిక్షణ అందించాలన్నారు. పాల వ్యాపారం ద్వారా ప్రతి మహిళ నెలకు దాదాపు రూ.15వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా సమాఖ్య నుంచి కొంతమంది సభ్యులను, పాడి రైతులను ఎంపిక చేసి త్వరలో గుజరాత్ అమూల్ డైరీ పరిశీలనకు పంపటం జరుగుతుందని, అక్కడ వ్యవస్థను పరిశీలించి ఇక్కడ అమలుచేసేందుకు కృషిచేయటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద ఏర్పాటుచేసుకున్న వివిధ వ్యాపార యూనిట్ల స్థితిగతుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళలు వ్యాపార ఆలోచనా విధానం పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల భర్తీ జరిగిందని ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించామని, ఆంగ్ల విద్యాబోధన కూడా జరుగుతుందని, ప్రభుత్వ బడులకు పిల్లలను పంపాలని కలెక్టర్ మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, తహసీల్దార్ శారదా, ఇందిరా మహిళా డైరీ మేనేజర్ సిద్దేశ్వర్, ఏపీఎం కె.వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య అధ్యక్షురాళ్లు, సభ్యులు, మహిళా పాడిరైతులు పాల్గొన్నారు.

